రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్ వార్త

## నాగారం మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా

**కీసర,అక్టోబరు7,ప్రభాతవార్త:**
నాగారం మున్సి పాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని మున్సి పల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. శనివారం మున్సి పాలిటీ పరిధిలోని 4వ వార్డు సంతోష్‌నగర్ కాలనీ, ఆర్ఎల్‌నగర్ కాలనీలో 11 లక్షలతో సీసీ రోడ్డు, 5వ వార్డులో 6.5 లక్షలతో అన్నమయ్య కాలనీలో సీసీ రోడ్లు, 3.5 లక్షలతో పార్క్ ప్రహరీ గోడ, 14వ వార్డులో సంతోష్‌నగర్ కాలనీలో 10 లక్షలతో సీసీ రోడ్డు, 16వ వార్డు నేతాజీనగర్ కాలనీలో 11 లక్షలతో సీసీ రోడ్డు, 18వ వార్డు ఎస్ కాలనీలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ నాగారం మున్సి పాలిటీని మంత్రి మల్లారెడ్డి సహకారంతో కోట్ల రూపాయలతో అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. మేడ్చల్ జిల్లాలోనే నాగారం మున్సి పాలిటీని నంబర్‌వన్‌గా తీర్చిదిద్దుతానన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ బండారి మల్లేష్, కౌన్సి లర్లు బిజ్జ శ్రీనివాస్‌గౌడ్, బుద్దవరం లక్ష్మీ వేణుగోపాల్, అన్నంరాజు లావణ్య శ్రీనివాస్, పంగ హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

## విజయభేరి సభ సక్సెస్‌తో..
# జిల్లా కాంగ్రెస్‌లో జోష్



-టికెట్ల కోసం పోటాపోటీగా ప్రయత్నాలు
- సర్వేల ఆధారంగా టికెట్లు అంటున్న అధిష్ఠానం
-చాలకాలంగా కష్టపడిపని చేసే వారికి టికెట్లు రాకపోవడంతో కొంత నిరుత్సాహం
-టికెట్లు రాని వారికి భవిష్యత్‌తో తగిన గుర్తింపు అంటు అధిష్ఠానం ..బుజ్జగింపులు



**రంగారెడ్డిజిల్లా ప్రతినిధి హైదరాబాద్ అక్టోబర్ 7 (ప్రభాతవార్త)**
ఎన్నికల వేళ కాంగ్రేస్ పార్టీలో నాయకులు, కార్యకర్తలు కొత్త జోష్‌తో ఉరకలు, పరుగులతో ప్రచార పర్వంలో కొనసాగుతున్నారు. గత సెప్టెంబర్ మాసంలో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రేస్ పార్టీ అధ్వర్యంలో నిర్వహించిన కాంగ్రేస్ పార్టీ విజయబేరి సభ అనుకున్న దానికంటే మరింత విజయవంతము కావడంతో జిల్లా కాంగ్రేస్ పార్టీలో నూతనోత్సవము వెలువడింది. రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది మంది కాంగ్రేస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు భారీ ఎత్తున తరలిరావడంతో జిల్లా కాంగ్రేస్ పార్టీలో పట్ట లేనంత ఆనందోత్సవాలను వ్యక్తంచేస్తున్నారు. కాంగ్రేస్ పార్టీ విజయబేరి సభ అనంతరం కాంగ్రేస్ పార్టీలోకి రాష్ట్ర వ్యాప్తంగా అనేక మంది ఇతర రాజకీయ పార్టీల నేతలు కాంగ్రేస్ పార్టీలోకి రావడం తో కాంగ్రేస్ పార్టీ గ్రాఫ్ పెరుగుతువస్తుందని రాజకీయ నిపుణులు అభిప్రాయ పడుతుండడంతో జిల్లా కాంగ్రేస్ పార్టీలోని నాయకులు కూడా ఒక అడుగు ముందుకేస్తున్న అనేక మంది కాంగ్రేస్ పార్టీలో శాసన సభ టికేట్ దక్కించుకోవడానికి ఆయా నియోజక వర్గాలో కాంగ్రేస్ పార్టీ సీనియర్లు పోటాపోటిగా ప్రయత్నాలు ప్రారంభిస్తున్నారు. దీంతో రాష్ట్ర కాంగ్రేస్ పార్టీ అధిష్టానం ఆయా నియోజకవర్గాలోని పార్టీలో టికేట్లు అశిస్తున్నా అభ్యర్థుల వారిగా ప్రాంతాల వారిగా సర్వేలు నిర్వహించినట్లు సమాచారం. కాంగ్రేస్ పార్టీతో పాటు ప్రవేట్ సంస్థల ద్వారా కూడా కాంగ్రేస్ పార్టీ అభ్యర్థుల గెలుపు, ఓటమిలపై కూడా ప్రత్యేక దృష్టి సారించినట్లు సామాచారం. ప్రజల్లో ఆదరణ ఉన్నటు వంటి నాయకులకే అధిక ప్రధాన్యత నివ్వడానికి అఖిల భారత కాంగ్రేస్ పార్టీ, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రేస్ పార్టీ కూడా ఒకే నిర్ణయానికి రావడంతో కాంగ్రేస్ పార్టీలో టికేట్ అశిస్తున్నా వారిలో కొందరు సంతోషం వ్యక్తం చేస్తుండగా మరికొంతమంది నిరుత్సహానికి గురవుతున్నారు. తాము కాంగ్రేస్ పార్టీలో సంవత్సరాల తరబడి పార్టీ కోసం ప్రజలకోసం పనిచేస్తున్న తమ లాంటి వారికి టికేట్ నిరాకరిస్తున్నారని తెలిసి ఇప్పటికే అనేక మంది కాంగ్రేస్ పార్టీ సీనియర్లు తర్జన భర్జనలు పడుతు తమ సహచరులతో మంతనాలు గడుపుతున్నారు. జిల్లా కాంగ్రేస్ పార్టీ అధ్యక్షుడు చల్లా నర్సింహ్మారెడ్డి తోపాటు అనేక మంది ఇదే అంశముపై నిత్యం సమాలోచనలు చేస్తున్నట్లు సామాచారం. రెండు మూడు రోజుల్లో కాంగ్రేస్ పార్టీలో అభ్యర్థుల ఖరారు కావడంతో పార్టీలో సీనియర్లు పార్టీ దిక్కార చర్యలకు పాల్పడుతారా లేక కాంగ్రేస్ పార్టీ రాష్ట్ర నాయకత్వం సుచనలమేరకు పార్టీలో అభ్యర్థుల గెలుపు కోసం పనిచేస్తారా అనే విషయం పై కూడా రాజకీయ సమాలోచనలు జరుగుతున్నాయి. ఇక కొంతమంది పార్టీలో సీనియర్ నాయకులు రాష్ట్రంలో కాంగ్రేస్ పార్టీ విజయం సాదించే సుచనలు కనిపిస్తున్నాయి. ఇలాంటి సమయంలో పార్టీని విడితే ఎలా ఉంటుందోననే మీమాంసములో క్షణం క్షణం ఉత్కంట చర్చలో మునిగి తేలుతున్నట్లు ప్రచారం కొనసాగుతుంది. తొందర పాటు చర్యలకు దిగకుండా ఇప్పటికే రాష్ట్ర కాంగ్రేస్ పార్టీ అనేక మంది సీనియర్లకు భవిష్యత్ మీదే నంటు భరోస ఇస్తున్నట్టు ప్రచారం జరుగుతుంది. కొంతమంది సీనియర్లను బుజ్జగింపులు కూడా చేస్తున్నారు. కాంగ్రేస్ పార్టీ అధికారంలోకి వస్తే తగిన స్థాయిలో న్యాయం చేస్తామని ఇప్పటికే కొంతమంది జిల్లా కాంగ్రేస్ పార్టీ నాయకులు రా ష్ట్ర పార్టీ నాయకులతో హామీలు పొందుతున్నట్లు గుసగుసలు కూడా వినిపిస్తున్నాయి. కాంగ్రేస్ పార్టీ విజయబేరి సభకు కేంద్ర ఎఐసిసి నేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ. మల్లికార్జున్ కార్గే, పలు రాష్ట్ర కాంగ్రేస్ నేతలు రాష్ట్ర ముఖ్యమంత్రులు తెలంగాణ కాంగ్రేస్ పార్టీ సభల్లో పాల్గొని కాంగ్రేస్ పార్టీ ప్రజాసంక్షేమ పతకాలు గురించి వివరించడంతో స్థానికంగా తెలంగాణలో కాంగ్రేస్ పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సహం నెలకొందని రాజకీయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## రామ్మోహన్‌రెడ్డికి ఎంపి టిక్కెట్ ఇవ్వాలి

-పరిగి టిక్కెట్ మనోహర్‌రెడ్డికి ఇవ్వాలి
-తాండూరు నియోజకవర్గం మహారాజులదే
-పీసీసీ ప్రధాన కార్యదర్శి ధారాసింగ్, ఉత్తమ్‌చంద్ స్పష్టీకరణ



**ప్రభాతవార్త, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :**
డీసీసీ అధ్యక్షుడు టీ. రామ్మోహన్‌రెడ్డికి చేవెళ్ల పార్లమెంట్ టిక్కెట్ ఇచ్చి బీ. మనోహర్‌రెడ్డికి పరిగి కాంగ్రెస్ టిక్కెట్ కేటాయించాలని తాండూరు సీనియర్ నేతలు డిమాండ్ చేశారు. పీసీసీ ప్రధాన కార్యదర్శి ధారాసింగ్, బీసీ సెల్ అధ్యక్షుడు ఉత్తమ్‌చంద్, పీ. జనార్ధన్‌రెడ్డి, హబీబ్‌లాల, ఎం.ఏ. అలీమ్, బంటు వేణుగోపాల్ , భీమేష్, ఉదయ్‌శంకర్ తదితరులు మాట్లాడుతూ యాభై ఏండ్లుగా మహారాజుల కుటుంబం కాంగ్రెస్ పార్టీకి సేవలు అందిస్తూనే ఉందని, వారికే ఎమ్మెల్యే టిక్కెట్ కేటాయించాలని స్పష్టం చేశారు. రాత్రికి రాత్రే పార్టీలు మారిన వ్యక్తులకు టిక్కెట్ ఇస్తామని కొంతమంది నేతలు ప్రకటించడం విడ్డూరంగా ఉందన్నారు. తాండూరులో ఇప్పటికే ఎమ్మెల్యేగా గెలిచి బీఆర్ఎస్‌లో చేరిన రోహిత్‌రెడ్డి మోసాన్ని పార్టీ శ్రేణులు జీర్ణించుకోలేకపోతున్నారని గుర్తు చేశారు. 2009 నుంచి ఇప్పటి వరకు రమేష్ మహారాజే పార్టీకి పెద్ద దిక్కుగా ఉన్నారని తెలిపారు. ఏఐసీసీ, పీసీసీల పిలుపు మేరకు అనేక కార్యక్రమాలు రమేష్ మహారాజ్ నాయకత్వంలో ఇక్కడ విజయవంతం చేశామని గుర్తు చేశారు. ఆయనను కాదని తాము ఎవరికీ సపోర్టు చేసే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. మనోహర్‌రెడ్డిని ఆదరాబాదరగా పార్టీలో చేర్చుకున్న డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి గాంధీభవన్ లేదా వికారాబాద్, పరిగిలో కండువా కప్పకుండా తాండూరుకు తీసుకురావడం చూస్తుంటే పార్టీలో చిచ్చు పెట్టడమేనని ఆరోపించారు. కొడంగల్, పరిగి జనరల్ స్థానాలను కాకుండా బీసీ నేత రమేష్ మహారాజ్ నియోజకవర్గంపై పొరుగు నియోజకవర్గాల నేతలు కుట్రలు పన్నడం శోచనీయమని మండిపడ్డారు. ఇప్పటివరకు తామంతా సహనంగా ఉన్నామని, ఇకపై ఎవరినీ ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. సర్వేల ప్రకారం రమేష్ మహారాజ్ లేదా ఆయన సూచించిన కేవల్లార్‌కు టిక్కెట్ ఇవ్వాలని అన్ని మండలాల కమిటీలు తీర్మానించి అధిష్ఠానానికి పంపిస్తున్నట్లు తెలిపారు. గెలిచే అవకాశాలు ఉన్న తాండూరులో బీఆర్ఎస్‌కు చెందిన మంత్రి కనుసన్నలలో గ్రూపు తగాదాలకు ఆజ్యం పోస్తున్నారని ఆరోపించారు. కేటీఆర్‌కు, మంత్రి మహేందంర్‌రెడ్డి వ్యాపారాలలో భాగస్వామి అయిన మనోహర్‌రెడ్డి మళ్లీ బీఆర్ఎస్‌లోకే వెళ్లిపోవడం ఖాయమని అ న్నారు. తనపై వ్యక్తిగత ఆరోపణలు చేస్తున్న కొంతమంది వ్యక్తులు నాలుక అదుపులో పెట్టుకోవాలని ధారాసింగ్ హెచ్చరించారు. డాక్టర్ సంపత్ ఏ పార్టీలో ఉన్నా గ్రూపు తగాదాలను ప్రోత్సహించడం అల వాటుగా మారిందని మండిపడ్డారు. ప్రశాంతంగా సాగుతున్న కాంగ్రెస్ పార్టీలో చిచ్చు పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు.

### 9న జరిగే ప్రజావాణి రద్దు : జిల్లా కలెక్టర్

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి అక్టోబరు 7, ప్రభాతవార్త :** మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం 9న జరిగే ప్రజావాణిని తాత్కాలికంగ రద్దు చేసినట్లు జిల్లా ప్రజలు గమనించాలని మేడ్చల్ జిల్లా కలెక్టర్ అమోయ్ కుమార్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో 9న జిల్లా స్థాయి అధికారులకు సోమవారం ఎన్నికల శిక్షణా తరగతులు నిర్వహించనున్నందున ఆ రోజు జరిగే ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగ రద్దు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. జిల్లా ప్రజలు దూర ప్రాంతాల నుంచి సోమవారం కలెక్టరేట్‌కు రావద్దని ప్రజావాణిని రద్దుచేసినట్లు అందరు గమనించాలని, జిల్లా అధికారులకు ఎన్నికల శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ప్రజలు ప్రజావాణి కోసం కలెక్టరేట్‌కు తరలిరావద్దని కలెక్టర్ సూచించారు.

## బిసిల సంక్షేమానికి, కులవృత్తులకు ప్రభుత్వ ప్రోత్సాహం : మంత్రి మల్లారెడ్డి



రాష్ట్ర మంత్రి మల్లారెడ్డి తన క్యాంపు ఆఫీస్‌లో బిసి బంధు చెక్కులను పంపిణీ చేసిన దృశ్యం

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి అక్టోబరు 7, ప్రభాతవార్త**
బిసిల సంక్షేమానికి, కులవృత్తిదారులను, చేతివృత్తిదారులను ఆర్థికంగ ఆదుకోవటానికి బిసి బంధు ద్వారా లక్ష రూపాయలు చేయూత నిస్తున్నట్లు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి సిహెచ్ మల్లారెడ్డి పేర్కొన్నారు. శనివారం బోయిన్‌పల్లిలోని రాష్ట్ర మంత్రి మల్లారెడ్డి క్యాంపు ఆఫీస్‌లో మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లా బిసి సంక్షేమ అధికారి కేశురామ్‌తో కలిసి మంత్రి మల్లారెడ్డి బిసి బంధు చెక్కులను 200 మందికి అందజేశారు. ఈ సందర్భంగ మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ బిసిల అభ్యున్నతికి, ఆర్థికంగ ఎదిగేందుకు అనేక సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం చేపడుతుందన్నారు. దీనిలో బిసి బందు లక్ష రూపాయల పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. అర్హులైన బిసి కులవృత్తుల, చేతివృత్తుల వారికి బిసి బంధు మంజూరు చేయటం జరిగిందన్నారు. సిఎం కెసిఆర్ ప్రతిష్టాత్మకంగ బిసిల కులవృత్తుల వారి కోసం బిసి బంధు తెచ్చారని అన్నారు. ఆధునికి పనిముట్లు, ముడిసరుకులు కొనుగోలు చేసుకుని ఉపాధి పొందాలని సూచించారు. కుటుంబాలు ఆర్థికంగ ఎదగాలని మంత్రి మల్లారెడ్డి సూచించారు. దళితుల కోసం దళిత బంధు, గొల్లకుర్మలకు మేకలు, గొర్రెల పంపిణీ, మత్సకారులకు వ్యాన్లు, ద్విచక్ర వాహాలు, చేపపిత్తన పిల్లలు పంపిణీకి సిఎం శ్రీకారం చుట్టారని అన్నారు. బిసి బంధును సద్వినియోగం చేసుకోవాలని లబ్దిదారులకు మంత్రి మల్లారెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా బిసి సంక్షేమ అధికారి కేశురామ్, మేడ్చల్ నియోజకవర్గ బిఆర్ఎస్ ఇంచార్జి మహేందర్‌రెడ్డి, పలువురు ప్రజాప్రతినిధులు, లబ్దిదారులు, బిసి శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ వృద్ధులను గౌరవించాలి

### -జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి

**వికారాబాద్, అక్టోబర్ 07, ప్రభాతవార్త:**
ప్రతి ఒక్కరూ వయోవృద్ధులను గౌరవించాలని జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి అన్నారు. శనివారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని మహిళ శిశు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యతిథిగా పాల్గొని మాట్లాడారు. వృద్ధాప్యంలో వయోవృద్ధులకు చేయూత అందిస్తూ వారు ఆనందంగా ఉండేలా చూడాల్సిన బాధ్యత కుటుంబ సభ్యులపై ఉందన్నారు. ఈ విషయంలో వయోవృద్ధులకు ఏమైనా ఇబ్బందులకు గురి చేస్తే సీనియర్ సిటిజన్ యాక్ట్ ప్రకారంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. వయోవృద్ధుల సమస్యల పరిష్కారం కోసం 24567 హెల్ప్ లైన్ తో పాటు వెబ్ సైట్ ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. జిల్లాలో 42487 మందికి రూ. 2016 లు వృద్ధాప్య పెన్షన్లు అందించడం జరుగుతుందని పేర్కొన్నారు. రాబోవు శాసనసభ ఎన్నికలలో వయోవృద్ధులందరూ తప్పనిసరిగా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఓటు హక్కు అనేది ఒక వజ్రాయుధం లాంటిదని ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరు నిజాయితీగా ఎలాంటి ప్రలోభాలకు లోనవకుండా వచ్చే ఐదు సంవత్సరాల పాటు మనల్ని పాలించే మంచి నాయకుల్ని ఎన్నుకోవాలని అన్నారు. ఎన్నికల కమిషన్ 80 సంవత్సరాలు దాటిన వయోవృద్ధులకు వారి ఇంటి వద్ద నుండే ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పించనున్నట్లు తెలిపారు. వయవృద్ధులు అందరూ ఓటింగులో వంద శాతం పాల్గొనాలని కోరారు. అనంతరం 9 మంది వయోవృద్ధులకు శాలువాలతో ఘనంగా సన్మానించారు. అక్టోబర్ 2 ండి 7 వరకు నిర్వహించిన జాతీయ వన్యప్రాణుల వారోత్సవాలలో భాగంగా 5వ తరగతి నుండి 10 వ తరగతి విద్యార్థులకు నిర్వహించిన పెయింటింగ్, వక్తృత్వ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు జిల్లా కలెక్టర్ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ నారాయణ అమిత్, డిడబ్ల్యుఓ లలితకుమారి, డీఎఫ్ఓ జ్ఞానేశ్వర్, డిప్యూటీ డిఆర్‌డిఓ నర్సింలు పాల్గొన్నారు.



వృద్ధులను సన్మానిస్తున్న జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి

## సమయ పాలన పాటించని బూర్గుల పీహెచ్‌సీ

- బూర్గుల పీహెచ్‌సీకి ఇష్టానుసారంగా వస్తున్న డాక్టర్లు, సిబ్బంది
- ఆసుపత్రి వద్ద పడిగాపులు కాస్తున్న రోగులు

**షాద్‌నగర్, అక్టోంబర్ 7, (ప్రభాతవార్త) :**
పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఎన్నో పథకాలను, సదుపాయాలను కల్పింస్తుంటే ఉద్యోగాలు చేస్తున్న కొంత మంది వైద్య సిబ్బంది మాత్రం నిర్లక్ష్యంగా విధులు నిర్వహిస్తున్నారు. అందుకు నిదర్శనంగా ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని బూర్గుల పీహెచ్‌సీ నిలుస్తుంది. శుక్రవారం ఉదయం పీహెచ్‌సీని స్థానిక జర్నలిస్టులు సందర్శించగా ఒక స్టాఫ్ నర్స్ మాత్రమే విధులు నిర్వహిస్తూ కనిపిస్తున్నారు. మిగతా వారు రాకపోవడంతో అన్ని గదులకు తాళాలతో దర్శనమించాయి. డాక్టర్ కూర్చీ ఖాళీగా ఉండటం, సంబంధిత వైద్య సిబ్బంది, ల్యాబ్ టెక్నిషన్లు లేకపోవడంతో వైద్యం కోసం వచ్చిన రోగులు ఆసుపత్రిలో డాక్టర్ల కోసం పడిగాపులు కాయాల్సిన పరిస్థితి నెలకొంది. ఇదేమని అక్కడ ఉన్న స్టాఫ్ నర్సు స్వరూపను అడగగా అందరు వస్తారు అంటూ సమాదానం ఇచ్చారు.

**ల్యాబ్ టెక్నిషిన్ రూటే వేరు...**
ఇక్కడ విధులు నిర్వహించే ల్యాబ్ టెక్నిషిన్ రూటే సపరేటు అన్నట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. ముఖ్యంగా ఆయన ప్రతి శుక్రవారం విధులకు గైర్హాజరు అవుతుంటారంటా... ఆ రోజు ఎంత మంది రోగులు వచ్చిన తిరిగివెళ్లాల్సిన పరిస్థితే.. అదేవిధంగా ఆసుపత్రి వైద్యులు సహితం ఉదయం 9 గంటల నుంచి 2 గంటల వరకు పక్కాగా విధులు నిర్వహించాల్సిన ఆయన 10.30 అయిన అందుబాటు లేకపోవడంతో రోగులు ఎక్కడి వారు అక్కడ కూర్చోని డాక్టర్ల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది.



10.15 గంటలకు డాక్టరు లేక ఖాళీగా ఉన్న డాక్టర్ కూర్చి.

**ఈ ఆసుపత్రిలో ఓపీకి వచ్చే రోగులు అధికమే...**
బూర్గుల పీహెచ్‌సీకి నిత్యం అధిక సంఖ్యలో వివిధ రోగాల బారిన పడిన వారు అధికంగా వస్తుంటారు. బూర్గుల చుట్టుపక్కల సుమారు 15 గ్రామ పంచాయతిల పరిధిలోని ప్రజలు వైద్యం కోసం ఇక్కడి పెద్ద సంఖ్యలో వస్తారు. ఈ పీహెచ్‌సీకి వచ్చే గత వారం రోజుల ఓపీ లిస్టు వరుసగా తీసుకుంటే... 70, 100, 42, 117, 66, 72, 81గా ఉన్నాయి. ఇలాంటి ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది సమయ పాలన పాటించకపోతే రోగుల పరిస్థితి ఏమిటని పలువురు గ్రామస్థులు, ఆసుపత్రికి వచ్చిన రోగులు సహితం ప్రశ్నిస్తున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు ఈ విషయమైన స్పందించి



డాక్టర్ల కోసం వేచి ఉన్న రోగులు

సంబంధిత వైద్య సిబ్బంది పనితీరును పర్యావేక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

**చర్యలు తీసుకుంటాం : జయలక్ష్మీ, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్ఓ, షాద్‌నగర్**
సంబంధిత వైద్యుల పనితీరుపై షాద్‌నగర్ డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్ఓతో విలేకరులు చరవాణిలో వివరణ కోరగా... డాక్టరు ఉదయం 9 గంటల నుంచి 2 గంటల వరకు కచ్చితంగా డీవ్యూటీ చేయాల్సిందేనని, ఈ విషయమైన సంబంధిత డాక్టర్‌ను అడిగి తెలుసుకుంటామని, అదేవిధంగా ల్యాబ్‌టెక్నిషియన్ సహితం ఒక్క మంగళవారం మినహా అన్ని రోజులు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విధులు నిర్వహిం చాల్సిందేని... ఈ విషయంపై పూర్తి విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకుంటాం.

## అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ ఆదర్శం

-కొడంగల్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యం
-రాష్ట్ర సమాచార పౌరసంబంధాల శాఖమంత్రి మహేందర్‌రెడ్డి

**కొడంగల్, అక్టోబర్ 7ప్రభాతవార్త**
పారిశ్రామిక, వ్యవసాయ, విద్య, వైద్యం, సంక్షేమ రంగాలతో పాటు అభివృద్దిలో తెలంగాణా రాష్ట్రం దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నదని రాష్ట్ర సమాచార పౌరసంబంధాలు, గనులు భూగర్బ వనరుల శాఖ మంత్రి పి. మహేందర్‌రెడ్డి అన్నారు. శనివారం కొడంగల్ నియోజకవర్గంలో స్థానిక ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డితో కలిసి వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మంత్రి పర్యటనలో భాగంగా కొడంగల్ మున్సిపల్‌లో 3591 బతుకమ్మ చీరల పంపిణీ, యువతకు స్పోర్ట్స్ కిట్స్‌లను మంత్రి అందజేశారు. అనంతరం రూ. 1కోటి నిధులతో కొడంగల్ నియోజకవర్గం కేంద్రంలో నిర్మించే షాదీఖానా భవనానికి ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి, మైనార్టీ ఫైనాన్స్ కమీషన్ సభ్యులు సలీంతో కలసి మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్బంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతు అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో దేశంలోనే తెలంగాణా రాష్ట్రం ఆదర్శంగా నిలుస్తున్నదని చెప్పారు. సంక్షేమ కార్యక్రమాలతో పాటు భవిష్యత్ తరాలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించడంతోపాటు మౌలిక సదుపాయాలు కల్పించడంలో భాగంగా మన ఊరు–మనబడి కార్యక్రమంలో వికారాబాద్ జిల్లాలోని 371 పాఠశాలలను రూ. 109 కోట్లతో అధునీకరిస్తున్నట్లు మంత్రి ఈ సందర్బంగా గుర్తు చేశారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం గతంలో 9వ తరగతి వరకు ఉండేదని ఇప్పటినుంచి 9,10 తరగతుల విద్యార్థులకు కూడా సన్నబియ్యంతో కూడిన మధ్యాహ్న భోజన పథకం అందిస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. నూతనంగా ప్రవేశపెట్టిన సీఎం అల్పాహారంతో జిల్లాలో 1051 పాఠశాలల్లోని 92 వేల మంది విద్యార్థులకు అందిస్తున్నట్లు మంత్రి ఈ సందర్బంగా పేర్కొన్నారు. కొడంగల్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి దిశగా ముందుకు తీసుకువెళ్తున్నామని మంత్రి తెలిపారు. కార్యక్రమంలో దౌల్తాబాద్ జడ్పీటీసీ కోట్ల మహిపాల్, మున్సిపల్ కౌన్సిలర్ మధుసుదన్‌యాదవ్, మైనార్టీ నాయకులు అబ్దుల్ వాహెబ్, నవాజోద్దిన్, సర్పంచ్‌లు సయ్యద్ అంజద్, మాజీసర్పంచ్ రమేష్‌బాబు, ఏకే. యుసుఫ్, జైన్‌లతో పాటు మున్సిపల్ కమీషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, స్థానిక మైనార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



కొడంగల్‌లో షాదీఖానా నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి మహేందర్‌రెడ్డి

## కనీవినీ ఎరుగని రీతిలో అభివృద్ధి

### -విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి హైదరాబాద్ అక్టోబర్ 7 ప్రభాతవార్త :**
స్వంత ఇంటి కన్నా గొప్పగా మహేశ్వరం నియోకగవర్గాన్ని తీర్చిదిద్దుతున్నానని మంత్రి సబితారెడ్డి పేర్కొన్నారు. శనివారం నూతనంగా ఏర్పాటు అయిన బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో రూ. 75కోట్ల నిదులతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, భవనాలకు ప్రారంభోత్సవాలు మంత్రి సబితారెడ్డి గావించారు. ఈ సందర్బంగా ఆమె మాట్లాడుతూ...బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఒకే రోజు రూ. 75కోట్ల నిధుల వ్యయంతో చేపట్టిన పనులకు శంకుస్థాపనలు ప్రారంభోత్సవాలు చేయటం ఎంతో సంతోషంగా ఉందన్నారు. నూతన కార్పొరేషన్ పరిధిలో ఇప్పటికి జిల్లా లైబ్రరీ, క్రీడా మైదానం, ఆరోగ్య కేంద్రం, ప్రారంభించుకోగా, సమీకృత మార్కెట్, పాఠశాల, నిర్మాణ పనులు, చెరువుల సుందరీకరణ పనులు చురుకుగా సాగుతున్నాయన్నారు. మహేశ్వరం నియోజకవర్గ ప్రజల ఆశీస్సులతో ప్రజలు తనపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా మరింత బాధ్యతగా పనిచేస్తానని పేర్కొన్నారు. నియోజకవర్గ సమగ్రాభివృద్ధి తన లక్ష్యం అన్నారు. కేసిఆర్, కేటిఆర్‌ల సంపూర్ణ సహకారంతో గతంలో చేసిన వాగ్దానాలతో పాటు చేయనున్న వాటిని కూడా నెరవేర్చి ముందుకు వెళ్తున్నట్లు తెలిపారు. సంక్షేమం, అభివృద్దే నినాదాలుగా విధానాలుగా రెండు కళ్లలాగా చూస్తు మహేశ్వరం నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలపాటనికి కృషిచేస్తున్నట్లు పేర్కొన్నారు. విద్య, వైద్యం, విద్యుత్, చెరువుల సుందరీకరణ, నాలల అభివృద్ధి, రోడ్లు, లైట్లు, తాగునీరు తదితర వాటితో పాటు నియోజకవర్గంలో అన్ని రంగాల అభివృద్ధికి బాటలు వేస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి కేసిఆర్ నేతృత్వంలోని, బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని మరొకసారి ఆశీర్వదించాలని ఆమె ప్రజలకు వివరించారు. సూపర్ స్పెషాలిటి ఆస్పత్రి ద్వారా కూడా నియోజకవర్గ ప్రజలకు ప్రయోజనం కలుగుతుందన్నారు.

## రోడ్డు పనులు వెంటనే చేపట్టాలి



కంకరతేలిన గౌడవెల్లి కండ్లకోయ జిల్లా పరిషత్ రోడ్డు

**మేడ్చల్, అక్టోబర్ 7. ప్రభాతవార్త :**
అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించి దేశంలోనె ఆదర్శంగా ఉన్నామని బిఆర్ఎస్ నేతల మాటలు ఆచరణలో ఉండవని, మేడ్చల్ మండలంలోని గౌడవెల్లి గ్రామంలో నాలుగు నెలల క్రితం రోడ్డు పనులు ప్రారంభించినా ఇప్పటివరకు పనులు ప్రారంభించకపోవడం విడ్డూరంగా ఉందని ఆ గ్రామానికి చెందిన బిజెపి మండల అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి ఓ ప్రకటనలో విమర్శించాడు. గౌడవెల్లి నుండి కండ్లకోయ వరకు రోడ్డు వేయటకు నాలుగు నెలల క్రితం మంత్రి మల్లారెడ్డి ఆర్భాటంగా రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించిన జిల్లా పరిషత్ రోడ్డు పనులు నేటికి పనులు ప్రారంభం కాలేదని ఆరోపించాడు. అధికారుల నిర్లక్ష్యం, కాంట్రాక్టర్ల కక్కుర్తి జరుగుతున్న ఆలస్యంతో పనులు మొదలు కాక వర్షాలకు రోడ్డు పూర్తిగా దెబ్బతిని కంకర తేలడంతో ప్రయాణికులు తీవ్రంగా ఇబ్బందులు పడుతు నరక యాతన పడుతున్నారని అన్నాడు. అలసత్యాన్ని వీడి వెంటనే పనులు చేయించే విదంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశాడు.

### గ్యాస్ రీఫిలింగ్ దుకాణాలపై టాస్క్‌ఫోర్స్ దాడులు

**తాండూరు, అక్టోబరు 7, ప్రభాతవార్త :** వికారాబాద్ జిల్లా తాండూరులో అక్రమంగా గ్యాస్ రీఫిలింగ్ చేస్తున్న దుకాణాలపై టాస్క్ ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించారు. శనివారం తాండూరు పట్టణంలోని సెంట్‌మార్క్స్ దగ్గర ముస్తఫా అనే వ్యక్తి దుకాణంలో అక్రమంగా నిబంధనలకు విరుద్ధంగా పెద్ద గ్యాస్ సిలిండర్ల నుండి చిన్న సిలిండర్లలోకి గ్యాస్‌ను రీఫిల్ చేస్తూ విక్రయిస్తున్నట్లు గుర్తించిన టాస్క్ ఫోర్స్ పోలీసులు తనిఖీలు నిర్వహించి 11చిన్న సిలిండర్లతో పాటు 3పెద్ద సిలిండర్లను స్వాదీనం చేసుకున్నారు. అదేవిదంగా పట్టణంలోని వినాయక్ చౌక్ సమీపంలో ఫజల్ అనే వ్యక్తి షాప్‌లో గ్యాస్ రీఫిల్ చేస్తున్నట్లు గుర్తించి 12చిన్న సిలిండర్లు, 2 పెద్ద సిలిండర్లు స్వాదీనం చేసుకున్నట్లు పట్టణ సీఐ రాజేందర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేయడం జరిగిందని సీఐ వివరించారు.



టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాదీనం చేసుకున్న గ్యాస్ సిలిండర్లు

## ఉప్పల్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి పరుస్తాం

### బిఆర్ఎస్ అభ్యర్థి బిఎల్ఆర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి బిఎల్ఆర్,కార్పోరేటర్ పన్నాల

నాచారం,అక్టోబర్ 7 ప్రభాతవార్త: ప్రజలు ఆశీర్వదించి ఓటు వేస్తే ఉప్పల్ నియోజక వర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరుస్తానని బిఆర్ఎస్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. మల్లాపూర్‌లో విఎన్ఆర్ గార్డెన్‌లో కార్పోరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి అధ్యక్షత బీఆర్ఎస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశానికి బిఎల్ఆర్ ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. నాయకులు, కార్యకర్తలు రెండు నెలలు కష్టపడి గెలుపుకోసం కృషి చేస్తే తాను నియోజక వర్గాన్ని 5సంవత్సరాల పాటు అభివృద్ధి చేసి చూపిస్తానని హామినిచ్చారు. ఉద్యమకారులందరికి సముచిత ప్రాధాన్యత కల్పిస్తానన్నారు. పారిశ్రామిక వాడలల సమస్యను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి నివాసయోగ్య ప్రాంతాలుగా మార్చినట్లు చెప్పారు. నియోజక వర్గానికి వందపడకల ఆసుపత్రి మంజూరు చేయించానని వెల్లడించారు. కార్యకర్తలందరికి ఇన్సూరెన్స్ సదుపాయాన్ని కల్పిస్తానని హామి నిచ్చారు. డిగ్రి, జూనియర్ కళాశాల ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. అశోక్‌నగర్‌లో హైటెన్షన్ వైర్ల సమస్యను, డ్రైనేజీ సమస్యలను పరిష్కరిస్తానని హామినిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంబీసీ మాజీ చైర్మన్ తాడూరి శ్రీనివాస్, మాజీ కార్పోరేటర్ గొల్లూర్ అంజయ్య, తండా వాసుదేవ గౌడ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

## క్రీడాకారులకు ప్రభుత్వం అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తుంది

### మంత్రి తలసాని



వాలీబాల్ విజేతలకు బహుమతులు ప్రధానం చేస్తున్న మంత్రి తలసాని, సినీనటులు నిఖిల్ సిద్ధార్థ్,విశ్వక్‌సేన్

కంటోన్మెంట్, అక్టోబర్ 7 ప్రభాతవార్త: క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అన్నివిధాలా సహాయ సహకారాలు అందిస్తుందని రాష్ట్ర పశు సంవర్ధక, సినిమాటోగ్రాఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. ఆదయ్య నగర్ మున్సిపల్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ లో తలసాని ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన తలసాని ఛాలెంజ్‌కప్ రాష్ట్ర స్థాయి వాలీబాల్ టోర్నమెంట్స్ ముగింపు వేడుకలకు వారు ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. ప్రపంచంలోని దేశాలు క్రీడాకారులకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తూ ప్రోత్సహిస్తున్నాయన్నారు. అదే విధంగా కేంద్ర ప్రభుత్వం వారికి తగిన ప్రోత్సాహాన్ని కూడా అందించాలన్నారు. ఈ పోటీల్లో బాలుర విభాగంలో 5 టీమ్‌లు పాల్గొనగా ఆర్మీ రెడ్ టీమ్ మొదటి బహుమతి కైవసం చేసుకుంది. దక్షిణ మధ్య రైల్వే ద్వితీయ స్థానం కైవసం చేసుకుంది. అదే విధంగా బాలికల విభాగంలో 4టీమ్‌లు పాల్గొనగా ఆదయ్య నగర్ టీమ్ మొదటి బహుమతి కైవసం చేసుకుంది. స్పోర్ట్స్ అథారిటీ టీమ్ ద్వితీయ స్థానం సంపాదించుకుంది. పాల్గొన్న క్రీడాకారులకు బహుమతులను ప్రధానం చేయడంతో పాటు మెమోంటోలు, ట్రోఫీలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ పార్లమెంట్ బిఆర్ఎస్ ఇన్‌ఛార్జి తలసాని సాయికిరణ్ యాదవ్, ఎమ్మెల్యే ముఠా గోపాల్, పోలీస్ హౌజింగ్ కార్పోరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్ గుప్త తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర సంపద పెంచి పేదలకు పంచడమే సిఎం కేసీఆర్ లక్ష్యం

### గృహలక్ష్మీ పథకం పత్రాల పంపిణీలో ఎమ్మెల్యే వివేకానంద్


లబ్దిదారులకు పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

దుండిగల్, అక్టోబర్ 7 ప్రభాతవార్త : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, గండిమైసమ్మ-దుండిగల్ మండలం, బహాదూర్‌పల్లిలోని మేకల వేంకటేశం ఫంక్షన్‌హాల్లో శనివారం ఏర్పాటు చేసిన గృహలక్ష్మీ పథకం పత్రాల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే వివేకానంద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా దుండిగల్ మున్సిపాలిటీకి చెందిన 679, కొంపల్లి మున్సిపాలిటీకి చెందిన 110, నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిని 10మంది లబ్దిదారులకు ఆయన గృహలక్ష్మీ పథకం పత్రాలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద ప్రజలకు గృహలక్ష్మీ పథకం ఓ వరమని పేదల సొంతింటి కల నేరవేర్చిన మహానుభావుడు సిఎం కేసిఆర్ అన్నారు. గృహలక్ష్మీ పథకం నిరంతర ప్రక్రియ అని పేర్కొన్నారు. రాష్ట్ర సంపద పెంచి పేదలకు పంచడమే సిఎం లక్ష్యమని, బిఆర్ఎస్ మాటల ప్రభుత్వం కాదని, చేతల ప్రభుత్వమన్నారు. కార్యక్రమంలో కమీషనర్ సత్యనారాయణరావు, తహాసీల్దార్ సుచరిత, కెఎంసి చైర్మన్ శ్రీశైలంయాదవ్, డిఎంసి వైస్‌చైర్మన్ పద్మారావు, డిఎంసి బిఆర్ఎస్ అధ్యక్షులు సంజీవరెడ్డి, కౌన్సిలర్లు నర్సారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఎలుగారి సత్యనారాయణ, సీనియర్ నాయకులు రవీందర్‌యాదవ్, నాగరాజుయాదవ్, జక్కుల శ్రీనివాస్, వివిధ విభాగాల అధికారులు, లబ్దిదారుల కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

## షేక్‌పేట్‌లో కోటి రూపాయలతో పైప్‌లైన్ పనులు ప్రారంభం


అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్

ఫిల్మ్‌నగర్, అక్టోబర్ 7, ప్రభాతవార్త : షేక్‌పేట్ డివిజన్‌లోని పలు ప్రాంతాలలో జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే, భారత రాష్ట్ర సమితి హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు మాగంటి గోపినాథ్ శనివారం అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. హకీంషా కాలనీలో 18 లక్షలతో సెవరేజ్ పైప్‌లైన్, విరాట్ నగర్‌లో 6.5లక్షలతో మంచినీటి పైప్‌లైన్, డైమండ్ డీల్ కాలనీలో 25లక్షలతో, 9లక్షలతో నగర్ కాలనీలో సెవరేజ్ పైప్‌లైన్ శంకుస్థాపన చేశారు. అదేవిధంగా షేక్‌పేట్ విలేజ్ సెవరేజ్ పైప్‌లైన్ 30 లక్షలతో, వివేకానందనగర్ కాలనీలో 16.50 లక్షలతో మంచినీటి పైప్‌లైన్ కోసం మంజూరైనవి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక డివిజన్ అధ్యక్షులు ప్రదీప్ కుమార్, ప్రధాన కార్యదర్శి షకీల్ అహ్మద్, గౌరీ శంకర్, పజ్జాద్, అకీల్, అక్బర్ భాయ్, ఎల్లేష్, రాము, శ్రీనివాస్, రమేష్, వీరేష్, నాగరాజ్, రాము తదితరులు పాల్గొన్నారు.

## గాంధీనగర్ డివిజన్‌లో కార్పొరేటర్ పాదయాత్ర


పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పావనీ వినయకుమార్

చిక్కడపల్లి, అక్టోబరు 7 ప్రభాతవార్త: గాంధీనగర్ డివిజన్‌లోని వివిధ ప్రాంతాలలో ప్రజా సమస్యలను తెలుసుకునేందుకు స్థానిక కార్పొరేటర్ ఎ.పావనీ వినయకుమార్ శనివారం పాదయాత్ర నిర్వహించి ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. డివిజన్ పరిధిలోని నర్మదా నర్సింగ్ హోం సమీపంలో మాధవరావు లేన్ రోడ్డు నిర్మాణం పనులను పురోగతిని బిజెవైఎం పూర్వ జిల్లా అధ్యక్షుడు ఎ.వినయ కుమార్, జిహెచ్ఎంసి ఏఇ అబ్దుల్ సలామ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహేష్‌తో కలిసి పరిశీలించారు. త్వరలోనే ఈ రోడ్డును ప్రజలకు అందుబాటోకి తేవడానికి చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. అధికారులపై వత్తిడి తీసుకురావడం మూలంగానే త్వరితగతిన పనులకు సంబంధించి అనుమతులు లభించాయన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నేతలు ఆనందరావు, రెహ్మాత్ ఆలీ, సుధాకర్, స్థానిక కాలనీవాసులు పాల్గొన్నారు.

## కార్మికుల జీవితాలతో చెలగాటమాడుతున్న బిఆర్ఎస్ ప్రభుత్వం: సత్య శ్రీరంగం

కెపిహెచ్‌బి కాలనీ, అక్టోబర్ 7, ప్రభాతవార్త : కార్మికుల జీవితాలతో అధికార ప్రభుత్వం చెలగాటమాడుతోందని టిపిసిసి అధికార ప్రతినధి డాక్టర్ సత్యంశ్రీరంగం మండిపడ్డారు. కూకట్‌పల్లి నియోజకవర్గం బాలానగర్ చౌరస్తా ఎమ్మార్వో ఆఫీస్ వద్ద తమ సమస్యల పరిష్కారం కోసం 13వ రోజు ఆశా వర్కర్ల ఆందోళనలో భాగంగా ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు మద్దతు తెలిపి వంటా వార్పు కార్యక్రమంలో పాల్గొన్న టిపిసిసి అధికార ప్రతినిధి, పిసిసి సభ్యులు డా.సత్యం శ్రీరంగం పాల్గొన్నారు. ఈ సందర్భంగా సత్యంశ్రీరంగం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆశా వర్కర్లపై కక్ష సాధింపు ధోరణి మానుకొని వారి సమస్యలు పరిష్కరంచాలని డిమాండ్ చేశారు. గతంలో ముఖ్యమంత్రి కెసిఆర్ ఆశా వర్కర్లను క్రమబద్ధీకరిస్తామని వారికి 18వేల జీతాన్ని ఇస్తామని ప్రకటించారని అన్నారు. వాటిని ఇప్పటివరకు అమలు చేయకపోవడంతోనే వారు సమ్మెకు దిగాల్సి వచ్చిందన్నారు. మంత్రి కెటిఆర్ ఆశా వర్కర్లు వినతిపత్రం ఇస్తామన్న తీసుకునే పరిస్థితిలో లేడని అన్నారు. కరోనా సమయంలో ఆశా వర్కర్ల సేవలు మరువలేనివని అన్నారు. నిత్యం ప్రజలకు సేవలు చేస్తున్న వారిని రాష్ట్ర ప్రభుత్వం చులకనగా చూడటం ఏంటని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ వీళ్ళ న్యాయమైన డిమాండ్లకు సంపూర్ణంగా మద్దతిస్తుందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే వీళ్ళ డిమాండ్లను సమస్యలను అన్ని తీరుస్తామని హామి ఇచ్చారు. ఆశా వర్కర్లపై కక్ష సాధింపు ధోరణి మానుకొని వెంటనే వేతనం పెంచి, సమ్మె విరమింపచేయాలనీ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా సెక్రటరీ ఐలాపురం రాజశేకర , కుక్కల రమేష్, కృష్ణరాజ్‌పుత్, రాము, నర్సింహాయాదవ్, వినయ్ ముదిరాజ్, జ్యోతి, రమాదేవి, విజయలక్ష్మీ, భారతమ్మ, రేణుక, జ్యోతి, మహేందం తదితరులు పాల్గొన్నారు.

## మహిళలకు చీరెలు పంపిణి చేసిన కార్పొరేటర్


మహిళలకు బతుకమ్మ చీరెలు పంపిణి చేస్తున్న మహాలక్ష్మీరామన్‌గౌడ్

హైదరాబాద్, అక్టోబరు 7 ప్రభాతవార్త: రానున్న బతుకమ్మ, దసరా పండుగలను పురస్కరించుకుని శనివారం వార్డు కార్యాలయంలో హిమాయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ జి.మహాలక్ష్మీరామన్‌గౌడ్, అధికారులతో కలిసి మహిళలకు బతుకమ్మ చీరెలను పంపిణి చేశారు. బతుకమ్మ, దసరా పండుగలను భక్తి, శ్రద్ధలతో కనుల పండువగా జరుపుకోవాలని ఆమె మహిళలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు రజిత, సిబ్బంది, బిజెపి నాయులు పాల్గొన్నారు.

## డ్రైనేజీ పైప్‌లైన్ పనులు ప్రారంభం


డ్రైనేజీ పైప్‌లైన్ పనులకు శ్రీకారం చుడుతున్న ఎమ్మెల్యే, కార్పొరేటర్

హైదరాబాద్, అక్టోబరు 7 ప్రభాతవార్త: కాచిగూడ డివిజన్‌లోని నింబోలిఅడ్డలోగల ఎకె భవన్ లైన్‌లో 18 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించనున్న డ్రైనేజీ పైప్‌లైన్‌కు అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, స్థానిక కార్పొరేటర్ ఉమారమేష్‌యాదవ్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, నాయకులు, కార్యకర్తలు, బస్తీ వాసులు పాల్గొన్నారు.

## 12 నుంచి టిటిడి డైరీలు, క్యాలెండర్ల విక్రయిం ప్రారంభం

సైఫాబాద్, అక్టోబరు 7 ప్రభాతవార్త : తిరుమల తిరుపతి దేవస్థానములు (టిటిడి) ముద్రించిన నూతన సంవత్సరం క్యాలెండర్లు, డైరీలు-2024 విక్రయాలు ఈ నెల 12 వ తేదీ నుంచి లిబర్టి వద్దగల శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో విక్రయించబడును. 12 పేజీల శ్రీదేవి భూదేవి సమేత శ్రీవారి ఫొటోలతో ఉన్న క్యాలెండర్ ధర 130 రూపాయలు, శ్రీవారి పెద్ద క్యాలెండర్ 20, శ్రీవారు పద్మావతిదేవి అమ్మవారు ఉన్న చిన్న క్యాలెండర్ ధర 15, టేబల్ క్యాలెండర్ 75, డైరీ పెద్దది 150 రూపాయలు, చిన్నది 120 రూపాయలకు విక్రయించబడును. ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోగలరు.

## సైక్లింగ్ వ్యాయమంతో ఆరోగ్యం



విద్యార్థికి చెక్కును అందజేస్తున్న కల్నల్ సంజయ్, డా. నవ్య

నాచారం,అక్టోబర్ 7 ప్రభాతవార్త: నేడు మారుతున్న జీవన శైలికి వ్యాయమం తరువాత సైక్లింగ్ కు ఎంతో ప్రాధాన్యత కల్గిఉందని కల్నల్ సంజయ్,అంకుర ఆసుపత్రి డా.నవ్య పేర్కొన్నారు. పల్లివి ఇంటర్నేషనల్ స్కూల్ ఆధ్వర్యంలో సైక్లోథాన్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల తల్లి,తండ్రులకు, విద్యార్థులకు 5కె.10కె సైక్లింగ్ పోటీలను నిర్వహించారు. ఎంతో ఉత్సాహంగా పాల్గొన్న ఈ క్రీడా పోటీలకు ముఖ్య అతిథులుగా కల్నల్ సంజయ్, అంకుర ఆసుపత్రి ఎండి డా.నవ్య, జాతీయ బాడి బిల్డర్ వాహిద్, డైరెక్టర్ సుశీల్ కుమార్‌లు పాల్గొని పోటీలను జెండా ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సైక్లింగ్, యోగా ద్వార శారీరక ఆరోగ్యం పొందవచ్చన్నారు. వ్యక్తి గత వికాసానికి ఆరోగ్యం ఎంతో ముఖ్యమన్నారు. ఈ సందర్భంగా పోటీల్లో పాల్గొన్న పేరెంట్స్ స్కూల్ యాజమాన్యానికి కృతజ్ఞలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పల్లవి ఇంటర్నేషనల్ స్కూల్ ప్రిన్సిపల్ గ్రెసిల్డా రోజ్ పలువురు విద్యార్థులు, వారి తల్లితండ్రులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీకి ఒక్క అవకాశం ఇవ్వండి


రాంగోపాల్‌పేట జీరా ఇందిరా నగర్ బస్తీలో పాదయాత్ర చేస్తున్న డాక్టర్ కోట నీలిమ

బేగంపేట అక్టోబరు 7,ప్రభాతవార్త : తెలంగాణా రాష్ట్రాన్ని ఇచ్చిన కాంగ్రెస్ పార్టీకి ఒక్క అవకాశం ఇవ్వాలని తెలంగాణా ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కోట నీలిమ విజ్ఞప్తి చేసారు.తెలంగాణా రాష్ట్రాన్ని ఇచ్చిన సోనియా గాంధికి సనత్‌నగర్ ప్రజలు కాంగ్రెస్ పార్టీకి తప్పకుండా విజయాన్ని ఇవ్వాలని కోరారు.ప్రజల సంక్షేమం కోసమే కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలను ఇచ్చిందన్నారు.శనివారం రాంగోపాల్‌పేట డివిజన్ లోని జీరా ఇందిరా నగర్ లో ఇంటింటికి తిరుగుతూ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను తెలియజేసారు.రాష్ట్రంలో సంక్షేమ ఫలాలు అట్టడుగు స్థాయి వరకు అందించడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైందని ఆమె విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఉష,సురేష్,అబ్దుల్ ఖరీం,రెహామాన్, శ్రీకాంత్‌చారి,తదితరులు పాల్గొన్నారు.

## అడ్డగుట్ట డివిజన్‌లో కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేస్తా : గణేష్ యాదవ్

అడ్డగుట్ట, అక్టోబర్ 7 ప్రభాతవార్త: అడ్డగుట్ట డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు తనవంతు కృషి చేస్తానని డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు గణేష్ యాదవ్ తెలిపారు. డివిజన్ అధ్యక్షులుగా నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు అనీల్ కుమార్ యాదవ్ నియామకపత్రాన్ని అందజేశారు.

## సనత్‌నగర్ బిసిలకే కేటాయించాలి

### అధిష్టాన వర్గం ఎఐసిసి, టి-పిసిసికి విజ్ఞప్తి చేసిన స్థానిక బిసి నేతలు


సమావేశంలో మాట్లాడుతున్న విజయవర్ధన్‌నాయుడు

సైఫాబాద్, అక్టోబరు 7 ప్రభాతవార్త: సనత్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గం టిక్కెట్‌ను స్థానికులైన బిసి అభ్యర్థులకే కేటాయించాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ బిసి నాయకులు అధిష్టాన వర్గానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు పార్టీ అధిష్టాన వర్గం ఎఐసిసి, టి-పిసిసి నేతలకు వినతి పత్రాలను సమర్పించామని వారు తెలిపారు. శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్టీ సీనియర్ నాయకులు కల్లూరి విజయవర్ధన్‌నాయుడు, డా.శివకుమార్, గుంటి సుధీర్‌కుమార్ మాట్లాడుతూ సనత్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గంలో అత్యధిక శాతం బిసి ఓటర్లు ఉన్నారని, పార్టీ అధిష్టాన వర్గం బిసిలకే సీటు కేటాయిస్తే సునాయసంగా విజయం సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. ఇటీవల ఓసి సామాజికి వర్గానికి చెందిన కొందరూ కోట నీలిమా, మర్రి ఆదిత్యరెడ్డి టెక్కట్ కోసం విశ్వప్రయత్నాలు చేస్తున్నారని, వారికి టిక్కెట్ కేటాయించరాదని కోరారు. ఎఐసిసిలో పనిచేస్తున్న పవన్ కోరా తన భర్తని కోట నీలిమా తనకు టిక్కెట్ వచ్చిందని సనత్‌నగర్ నియోజవర్గంలోని ఓటర్లకు, నాయకులకు మాయ మాటలు చెపుతూ ప్రచారం చేసుకుటుంన్నారని, ఆమె మాయ మాటలను ప్రజలు, ఓటర్లు నమ్మడం లేదని వారు స్పష్టం చేశారు. గతంలో డాక్టర్ మర్రి చెన్నారెడ్డికి, ఆయన కుమారుడు మర్రి శశిధర్‌రెడ్డికి బిసిలు ఓట్లు వేసి గెలిపించారని ఇప్పుడు కొత్తగా ఆయన కోడుకు ఆదిత్యరెడ్డి కూడా పోటికి సిద్దమైనారని, ఇలా అగ్రవర్ణాలను గెలిపించుకుంటాపోతే దశాబ్దాల తరబడి కాంగ్రెస్ పార్టీలో సేవలు అందిస్తున్న బిసి పరిస్థితి ఏమిటని వారు ప్రశ్నించారు. కోట నీలిమా, ఆదిత్యరెడ్డికి సీటు కేటాయించరాదని స్థానికులైన, బిసిలైన తమకు అధిష్టాన వర్గం సీటు కేటాయించాలని, కల్లూరి విజయవర్ధన్‌నాయుడు, గుంటి సుధీర్‌కుమార్ విజ్ఞప్తి చేశారు.

## సమస్యలు పాదయాత్ర ద్వారానే తెలుస్తాయి

### బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు


కరపత్రాలను అందజేస్తున్న రాజేశ్వరరావు

కెపిహెచ్‌బి కాలనీ, అక్టోబర్ 7, ప్రభాత వార్త : కూకట్‌పల్లి నియోజకవర్గంలో చేపడుతున్న పాద యాత్ర ద్వారా పలు సమస్యలు బయటపడుతున్నా యని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు పేర్కొన్నారు. శనివారం కూకట్‌పల్లి నియోజకవర్గ భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఫతేనగర్ డివిజన్ పరిధిలోని లైన్ రోడ్‌లోని గణేష్ దేవాలయం నుండి ఇంటింటికి బిజెపి భరోసా యాత్ర 57వ రోజు పాదయాత్రలో వడ్డేపల్లి రాజేశ్వరరావు పాల్గొన్నారు. గడపగడపకు తిరుగుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ (అర్బన్) బిజెపి అధ్యక్షుడు పన్నాల హరీష్‌రెడ్డి, కూకట్‌పల్లి అసెంబ్లీ కన్వీనర్ శ్రీకర్‌రావు, రాష్ట్ర నాయకులు ప్రేమ్ కుమార్, కృష్ణాగౌడ్, హరిప్రసాద్, బానేష్, యాదగిరి, నరేష్, చంద్రారెడ్డి, రమేష్, రేవప్ప, రవి, అస్లాం, నాగేష్, తులసి, కార్తిక్, సాయి, తేజ, ఉషారాణి, కృష్ణవేణి, సురేష్, బ్రహ్మం, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలు పేదలకు వరం లాంటివి

### అల్పాహార పథకాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



కెపిహెచ్‌బి కాలనీ, అక్టోబర్ 7, ప్రభాతవార్త : ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రవేశపెట్టిన పథకాలన్నీ నిరుపేదలకు మేలు చేకూర్చేవేనని ఆయన ఆలోచన ముందుగా పేదల కుటుంబం నుంచి మొదలవుతుందని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలో ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన అల్పాహార పథకాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, జోనల్ కమీషనర్ మమత పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మానవీయ కోణంలో ఆలోచించే గప్ప ముఖ్యమంత్రి కెసిఆర్ అన్నారు. ఇప్పటికే నిరుపేద విద్యార్థులైన పిల్లలకు ప్రభుత్వ పాఠశాలలో సన్నబియ్యం భోజనం పెట్టడమే కాకుండా నేడు అల్పాహారం అందించడం ఎంతో సంతోషకరంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ ఆంజనేయులు, ఉపాధ్యాయులు, మాజీ కార్పొరేటర్ తూము శ్రవణ్ కుమార్ పాల్గొన్నారు.

## మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత: రేఖ యాదగిరి

### రూ.23.42.కోట్ల పనులకు ఆమోదం తెలిపిన కౌన్సిల్ సభ్యులు


నార్సింగి మున్సిపల్ సాధారణ కౌన్సిల్ సమావేశంలో పాల్గొన్న చైర్ పర్సన్ రేఖ యాదగిరి, కమిషనర్ సురేందర్‌రెడ్డిలు

నార్సింగి, అక్టోబర్ 7 ప్రభాతవార్త : నార్సింగి మున్సిపాలిటీలో మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక ప్రాధాన్యతనిస్తున్నామని చైర్ పర్సన్ దారుగుపల్లి రేఖ యాదగిరి పేర్కొన్నారు. శనివారం నార్సింగి మున్సిపల్ కార్యాలయంలో సాధారణ కౌన్సిల్ సమావేశంను నిర్వహించారు. కమీషనర్ సురేందర్‌రెడ్డి, కౌన్సిలర్లు యాదమ్మ, విజిత ప్రశాంత్ యాదవ్, సునీత గణేష్, జి.శివారెడ్డి, పత్తి శ్రీకాంత్, అరుణజ్యోతి, విజయ్ బాబు, దుర్గేష్ యాదవ్, ఉషారాణి, ప్రవళిక కిరణ్ తదితరులతో కలిసి రేఖ యాదగిరి సమావేశంను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సభ్యులందరి సూచలనలు, సలహాలు పరిగణనలోకి తీసుకొని పలు అభివృద్ధి పనులకు నిదులు ఖర్చు చేయాలని తీర్మాణం చేశామన్నారు. పార్కులు, స్మశాన వాటికలు, రోడ్ల పక్కన సుందరీకరణ పనులకు గాను రూ.13 కోట్లు, ఫుట్ పాత్‌లు, కమ్యూనిటీహాళ్లు, మాడ్రన్ లైటింగ్, పేయింటింగ్ పనులకు గాను రూ.10.42కోట్లను కేటాయిస్తున్నామని చైర్ పర్సన్ రేఖ యాదగిరి స్పష్టం చేశారు.

## బిఆర్ఎస్‌కు మద్దతు ప్రకటించిన లోక్‌దళ్ పార్టీ

సైఫాబాద్, అక్టోబరు 7 ప్రభాతవార్త: కేంద్రంలోని బిజెపి, గతంలో దేశాన్ని ఏలిన కాంగ్రెస్ పార్టీ తమ తప్పిదాలను కప్పిపుచ్చుకునేందుకే మాయ మాటలు చెప్పి ప్రజలను అకట్టుకునే ప్రయత్నాలు చేస్తున్నాయని లోక్‌దళ్ పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు పి.వెంకటరాజేశ్వర్‌రావు ఆరోపించారు. ఆ పార్టీ నాయకులు ఎన్ని మాయమాటలు చెప్పినా, ఎన్ని జిమ్మిక్కులు చేసినా ఓటర్లు నమ్మె స్థితిలో లేరని ఆయన స్పష్టం చేశారు. శనివారం లోక్‌దళ్ పార్టీ నగర కమిటి సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రంలో బిఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలకు అకర్షితులై వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ బిఆర్ఎస్‌కు సంపూర్ణంగా మద్దతు ఇస్తుందని చెప్పారు. రైతులకు ఉచిత విద్యుత్, రైతు బంధు, దళిత బంధు, కళ్యాణలక్ష్మి, షాది ముబారక్, మిషన్ భగీరధ, కాకతీయ తదితర ఎన్నో ప్రాజెక్టులు చేపట్టి ప్రజలకు మేలు చేస్తున్నందుకే మద్దతు ఇస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నగర నాయకులు రాజు, ముఖేష్, శ్యాం, గాయిత్రి తదితరులు పాల్గొన్నారు.

## మానసిక ఆరోగ్యంపై వినూత్న రీతుల్లో అవగాహన కార్యక్రమాలు

సైఫాబాద్, అక్టోబరు 7 ప్రభాతవార్త: ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మానసిక ఆరోగ్యంపై ఈ నెల 8వ తేదీ నుంచి 15 వరకు రాష్ట్ర వ్యాప్తంగా వినూత్న రీతుల్లో అవగాహన కార్యక్రమాలు, సదస్సులు నిర్వహిస్తున్నామని తెలంగాణ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డా. మోతుకూరి రాంచందర్ తెలిపారు. ప్రపంచ ఆరోగ్య సమాఖ్య ఇచ్చిన పిలుపు మేరకు మానసిక ఆరోగ్యమనేది సార్వత్రిక మానవ హక్కు అనే నేపథ్యంతో తమ సంస్థ పైకార్యక్రమాలను నిర్వహిస్తున్నదని శనివారం నాడిక్కడ ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన చెప్పారు. తెలంగాణ రాష్ట్రంలో ఎంపిక చేయబడిన కళాశాలల్లో మానసిక ఆరోగ్యంపై అవగాహన సదస్సులు వివిధ అంశాల్లో సైకాలజి విద్యార్థులకు పోటీలు, మానసిక శిభిరాలు 15వ తేదీ వరకు నిర్వహించబడతా యన్నారు. ముఖ్యంగా మనిషి ఆరోగ్యంగా ఉండటానికి మానసిక ఆరోగ్యం ఎంతో ముఖ్యమన్నారు. మానసికఆరోగ్యాన్ని కాపాడుకుంటే మనిషి జీవితం సుఖమయం అవుతుందన్నారు.

## బతుకమ్మ చీరెలను పంపిణి చేసిన కార్పొరేటర్ జి.శంకర్‌యాదవ్



బేగంబజార్,అక్టోబర్ 7ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్రంలో మహిళలకు బతుకమ్మచీరెలను బేగంబజార్ కార్పొరేటర్ గొంటి శంకర్‌యాదవ్ అందచేశారు.బేగంబజార్ డివిజన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిన బతుకమ్మచీరెలను మహిళలకు అందచేశారు. ఈకార్యక్రమంలో బిజెపి నాయకులు, కట్ట రమేష్‌ముదిరాజ్,కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా రామాయణ్ మేళా ఉత్సవాలు


రామాయణ్‌మేళా కమిటి సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ గోవింద్‌రాఠి

అఫ్జల్‌గంజ్, అక్టోబర్ 7 ప్రభాతవార్త: నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో అక్టోబర్15 నుంచి అక్టోబర్ 24వ తేది వరకు రామాయణ్‌మేళా ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకుగాను ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు మేళా చైర్మన్ గోవింద్‌రాఠి తెలిపారు.శనివారం మేళా ప్రతినిధులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రతియేటా మాదిరిగానే ఈయేదు కూడా మేళా ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు చెప్పారు.ఈ సమావేశంలో మేళా ప్రతినిధులు గిరిధర్‌లాల్‌డాగా, మనోజ్ జైస్వాల్, సుమీత్‌రాఠి,నందగోపాల్ బట్టడ్ పాల్గొన్నారు.

## ఐఏసిసి రీజనల్ ప్రెసిడెంట్‌గా శ్రీకాంత్ బాడిగ

హైదరాబాద్, అక్టోబరు 7,ప్రభాతవార్త: ఇండో అమెరికన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ( ఐఏసిసి) ఏపీ - తెలంగాణ చాప్టర్ కొత్త ఆఫీస్ బేరర్లను ఎన్నుకుంది. శనివారం నగరంలో జరిగిన ఎన్నికల్లో ఐఏసిసి సదరన్ రీజినల్ ప్రెసిడెంట్‌గా ఫీనిక్స్ డైరెక్టర్ శ్రీకాంత్ బాడిగ అన్నికయ్యారు. రహేజ ఐటి పార్కు సిఎఫ్ఓ కె.గణేష్ సుబుధిని చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే అవినాష్ చుక్కపల్లి , శ్రీదేవి దేవిరెడ్డిలు వైస్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. కాగా కొత్తగా ఎన్నికైన అధ్యక్షులు శ్రీకాంత్ బాడిగ వివిధ కేంద్రప్రభుత్వ, అంతర్జాతీయ ప్యానల్స్‌లో పనిచేశాడు. అలాగే కేంద్ర పరిశ్రమల మంత్రిత్వశాఖ బోర్డు ఆఫ్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. కాగా ఐఏసిసి అనేది 1968లో స్థాపించబడింది. ఇది భారతదేశం-యుఎస్ ఎకనామిక్ ఎంగేజ్‌మెంట్‌ను సమన్వయం చేసేందుకు కృషి చేస్తుంది. ఇందలో దాదాపు 1500మంది సభ్యులు ఉన్నారు.

## అక్బర్ ఆలీఖాన్ కుటుంబ సభ్యులకు మంత్రి పరామర్శ


ఓల్డ్ కస్టమ్స్ బస్తీలో అక్బర్ ఆలీఖాన్ పార్థివ దేహం వద్ద నివాళులు అర్పిస్తున్న మంత్రి తలసాని

బేగంపేట అక్టోబరు 7,ప్రభాతవార్త : బేగంపేట టీఆర్ఎస్ సీనియర్ నాయకులు సలీంఖాన్ సోదరుడు అక్బర్ ఆలీఖాన్ పార్థివ దేహాన్ని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా సలీంఖాన్ కు ధైర్యం చెప్పారు.అక్బర్ ఆలీఖాన్ కుటుంబసభ్యులకు ధైర్యం చెప్పారు. అక్బర్ ఆలీఖాన్ పార్థివ దేహం వద్ద మంత్రి నివాళులు అర్పించారు.తన ప్రగాఢ సానుభూతిని తెలియజేసారు.మంత్రి వెంట కార్పోరేటర్ మహేశ్వరి శ్రీహరి,బీఆర్ఎస్ నాయకులు డి.వి.నరేందర్‌రావు నాయి.టి.శ్రీహరి,శ్రీనివాస్‌గౌడ్, శేఖర్ ముదిరాజ్,అక్బర్,ఆరీఫ్,ఖలీల్,ఫాజల్ ఉన్నారు.

## గృహాలక్ష్మీ పథకం పత్రాల పంపిణీ

దుండిగల్, అక్టోబర్ 7 ప్రభాతవార్త : గాజులరామారం డివిజన్ పరిధి మహారాజ గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన గృహాలక్ష్మీ పథకం పత్రాల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే వివేకానంద్ ముఖ్య అతిథిగా హాజరై కుత్బుల్లాపూర్ మండల పరిధిలోని 764మంది లబ్దిదారులకు పత్రాలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గృహాలక్ష్మీ పథకం కింద శాశ్వత నిర్మాణానికి లబ్దిదారులు దశల వారీగా రూ,3లక్షలు పొందవచ్చు అన్నారు. అర్హులైన వారందరూ ఈపథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నియోజకవర్గం యూత్ అధ్యక్షులు సోమేష్‌యాదవ్, నాయకులు లక్ష్మారెడ్డి, జైరాం, పుప్పాల భాస్కర్, రుద్రా అశోక్, శంకరయ్య, పోలే శ్రీకాంత్, కస్తూరి బాలరాజు, రషీద్‌బైగ్, మారయ్య, వివిధ విభాగాల అధికారులు, లబ్దిదారులు పాల్గొన్నారు.

## బతుకమ్మ పండుగకు చీరలు పంపిణీ చేయడం అభినందనీయం : లాస్య



కంటోన్మెంట్ 1వ వార్డులో బతుకమ్మ చీరలు పంపిణీ చేస్తున్న బిఆర్ఎస్ అభ్యర్థి లాస్య నందిత, జక్కుల మహేశ్వర్ రెడ్డి

కంటోన్మెంట్, అక్టోబర్ 7 ప్రభాతవార్త: తెలంగాణ ఆడపడుచుల ఆత్మ గౌరవాన్ని పెంపొందించేందుకు సిఎం కేసిఆర్ ఎంతో కృషి చేస్తున్నారని కంటోన్మెంట్ బిఆర్ఎస్ అభ్యర్థి లాస్య నందిత తెలిపారు. శనివారం 1వ వార్డు సంజీవయ్య నగర్‌లో నివాసం ఉంటున్న మహిళలకు బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లాస్య మాట్లాడుతూ దసరా పండుగకు పుట్టించి సారెగా సిఎం కేసిఆర్ బతుకమ్మ చీరలను పంపిణీ చేస్తున్నారని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్ రెడ్డి, బిఆర్ఎస్ నాయకులు నివేదిత తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్య తెలంగాణ కోసం పాటుపడతాం

**తెలంగాణ స్టేట్ డాక్టర్స్ ఫోరం**



ప్యానల్ కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, లింగంగౌడ్, కీర్తన తదితరులు

హైదరాబాద్, అక్టోబరు 7,ప్రభాతవార్త: ఆరోగ్యతెలంగాణ ఓసం పాటుపడతామని తెలంగాణ స్టేట్ డాక్టర్స్ ఫోరం స్పష్టం చేసింది. తెలంగాణ స్టేట్ మెడికల్ కౌన్సిల్ (టిఎస్ఎంసి)కు జరుగఉతున్న ఎన్నికల్లో 13మందితో కూడిన వైద్యులతో ప్యానల్‌గా ఏర్పడి తాము పోటీ చేస్తున్నట్లు ఫోరం వర్కింగ్ ప్రెసిడెంట్ గట్టు శ్రీనివాసులు తెలిపారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వైద్యులు చీమ శ్రీనివాస్, గోంగూర వెంకటేశ్వర్లు, లింగంగౌడ్, కీర్తనలు మాట్లాడారు. ప్రభుత్వం వైద్యరంగంలో తీసుకువచ్చే విప్లవాత్మక మార్పులకు సలహాలు సూచనలు ఇచ్చే టిఎస్ఎంసిలో పేద ప్రజల పక్షాన చికిత్సలు అందించే వైద్యులు ఉండటం కీలకమన్నారు. రాష్ట్రఏర్పాటు అనంతరం మొదటిసారిగా జరుగుతున్న ఎన్నికల్లో తమ ఫోరం లక్ష్యాలను వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా 48,405మంది వైద్యులు ఓటుహక్కు కలిగి ఉన్నారని వారు ఈఎన్నికల్లో ఓటుహక్కును వినియోగించుకోనున్నట్లు పేర్కొన్నారు.

## కులమతాలకతీతంగా పండగులు



ఫిలింనగర్‌లో బతుకమ్మ చీరలను పంపిణీ చేస్తున్న జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్

ఫిల్మ్‌నగర్, అక్టోబర్ 7, ప్రభాతవార్త : జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్ కమ్యూనిటీ హాల్, జవహర్ నగర్ గవర్నమెంట్ స్కూల్‌లో మహిళలకు చీరలను శనివారం జూబ్లీహిల్స్ డివిజన్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ పంపిణీ చేశారు. ఆ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి కెసిఆర్ కులమతాలకు అతీతంగా అన్ని పండుగులకు ఆదరిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి అధికారులు ఏఈ వెంకటేష్, డిపిఓ లలిత కుమారి, సిఓ బచ్చమ్మ, ఎస్ఎఫ్ఏ సూపర్వైజర్ మహేందర్, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు మామిడి నర్సింగ్‌రావు, మారమ్మ, పద్మ, మహేశ్వరి, భాగ్య తదితరులు పాల్గొన్నారు.

## రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

**రెడ్డి ఐక్యవేదిక డిమాండ్**



అభివాదం చేస్తున్న శంకర్‌రెడ్డి, నాగిరెడ్డి, మోహన్‌రెడ్డి తదితరులు

హైదరాబాద్, అక్టోబరు 7,ప్రభాతవార్త: రెడ్డి సామాజిక వర్గంలో జన్మించి పేదరికాన్ని అనుభవిస్తున్న వారి కోసం రెడ్డి కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి ఆదుకోవాలని రెడ్డి ఐక్యవేదిక ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఐక్యవేదిక నాయకులు డి.శంకర్‌రెడ్డి, నాగిరెడ్డి, మోహన్‌రెడ్డిలు మాట్లాడారు. అగ్రకులంగా పేర్కొనబడుతున్న రెడ్డి సామాజికవర్గంలో కడుపేదరికం అనుభిస్తున్న ఎన్నో కుటుంబాలు ఉన్నాయన్నారు. ఎంతోమంది మహానగరంలో కూలీలుగా, సెక్యూరిటీ గార్డులుగా జీవనం సాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ఏర్పాటు అనంతరం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఆదుకుంటామని కెసిఆర్ హామీ ఇచ్చి మరిచారని ఇప్పటికైనా ముఖ్యమంత్రి కెసిఆర్ రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేసి నిధుల సమకూర్చాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకుంటే గజ్వేల్ నుంచి కామారెడ్డివరకు నిరసనగా పాదయాత్ర నిర్వహిస్తామని హెచ్చరించారు.

### మ్యాథ్స్ ఒలింపియాడ్‌లో రెసోనెన్స్ విద్యార్థుల ప్రతిభ

హైదరాబాద్, అక్టోబరు 7,ప్రభాతవార్త: రెసోనెన్స్ స్కూల్ విద్యార్థులు 19మంది ఇండియన్ ఒలింపియాడ్ క్వాలిఫైయర్ ఇన్ మ్యాథమెటిక్స్ (ఐఓక్యూఎం)లో విజయం సాధించారు. మ్యాథమెటిక్స్ టీచర్స్ అసోసియేషన్ దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న పోటీల్లో రెసోనెన్స్ విద్యార్థులు ఈఘనత సాధించారు. ఈసందర్భంగా ఇనిస్టిట్యూషన్ డైరెక్టర్ పూర్ణచంద్రరావు మాట్లాడుతూ ఒకే పాఠశాలలో ఇంతమంది విద్యార్థులు ఉత్తీర్ణత కావడం అరుదైన విషయమని ప్రపంచంలోనే అత్యధిక కష్టతరమైన మ్యాథ్స్ ఒలింపియాడ్‌లో తమ మొదటిబ్యాచ్ విద్యార్థులు ఈఅద్భుతమైన ఫలితాలు సాధించడం సంతోషంగా అన్నారు. విద్యార్థులను మ్యాథ్స్‌లోనే కాకుండా సైన్స్,సోషల్, ఇంగ్లీస్ సబ్జెక్టులతో బోర్డు పరీక్షలకు సిద్ధం చేస్తున్నామని పేర్కొన్నారు.

## 104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

**తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ డిమాండ్**



104 ఉద్యోగుల ఛలో హైదరాబాద్ కార్యక్రమంలో ప్రసంగిస్తున్న భూపాల్

ధర్నాచౌక్, అక్టోబర్ 7, ప్రభాతవార్త: గత 15 సంవత్సరాలుగా ఎలాంటి ఉద్యోగ భద్రత లేకుండా తెలంగాణ రాష్ట్రంలో పని చేస్తున్న 104 ఉద్యోగుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ గౌరవాధ్యక్షులు భూపాల్ డిమాండ్ చేశారు. శనివారం ఆ యూనియన్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఛలో హైదరాబాద్ పేరుతో మహాధర్నా నిర్వహించారు. ఈ ధర్నానుద్దేసించి భూపాల్ మాట్లాడుతూ 104 ఎఫ్‌డిహెచ్ఎస్ ఉద్యోగులకు వేతనాలు ఏజెన్సీ ద్వారా కాకుండా ట్రెజరీ ద్వారా ప్రభుత్వమే చెల్లించాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ఉద్యోగులందరినీ క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. 104 ఏఎన్ఎంలను రెండవ ఏఎన్ఎంలుగా గుర్తించి, రెగ్యులర్ చేయాలని, 104 ఎఫ్‌డిహెచ్ఎస్ ఉద్యోగులకు వారు ఇచ్చిన ఆప్షన్ ప్రకారం స్వంత జిల్లాలకు బదిలీ చేయాలని, హెల్త్ కార్డులు, ఆరోగ్య భీమా సౌకర్యం కల్పించాలన్నారు. ఈ ధర్నా కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర కార్యదర్శి వి.విజయవర్ధన్‌రాజు, అధ్యక్షులు ఎం.డి.ఫసీయొద్దీన్, ప్రధాన కార్యదర్శి కే.యాదా నాయక్, రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలో పనిచేస్తున్న 104 ఉద్యోగులు పాల్గొన్నారు.

## పేద ప్రజలకు అండగా గ్యారంటీలు : పి.విజయారెడ్డి

ఖైరతాబాద్, అక్టోబరు 7 ప్రభాతవార్త: పేద ప్రజలకు అండగా కాంగ్రెస్ గ్యారంటీలను రాబోయే కాలంలో ఇవ్వనుందని కార్పొరేటర్, టిపిసిసి ప్రధాన కార్యదర్శి పి.విజయారెడ్డి పేర్కొన్నారు. 'హాత్ సెమాత్ జోడో' యాత్రలో భాగంగా తమ నేతలు రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డీల నేతృత్వంలో సుడిగాలి పాదయాత్రను ఖైరతాబాద్ నియోజక వర్గం పరిధి డివిజన్‌లలోని బస్తీల, కాలనీలలో విజయారెడ్డి ఇంటింటికి తిరిగి గ్యారంటీలతో కలిగి ఉన్న కరపత్రాన్ని పంపిణి చేస్తూ అన్ని వర్గాలలో పేద ప్రజలకు అండగా కాంగ్రెస్ నిలుస్తుందన్నారు. ఎన్ని రాజకీయ శక్తులు, పార్టీలు విమర్శలు గుప్పించినా గతంలో ఇందిరాగాంధీ, రాహుల్ గాంధీలను నేడు సోనియమ్మను ప్రజలంతా గుర్తు చేసుకుంటున్నారని స్పష్టం చేశారు. సుస్థిరపాలన అందించేది కాంగ్రెస్ మాత్రమేనని విజయారెడ్డి అన్నారు. పలు కార్యక్రమంలో ముఖ్యం 'హాత్ సే హాత్ జోడో' యాత్రలో నాయకులు, అభిమాన కార్యకర్తలు, బస్తీల, కాలనీల పెద్దలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## సీఎం బ్రేక్‌ఫాస్ట్ కార్యక్రమం పేద విద్యార్థులకు వరం

**తెలంగాణ అడ్వకేట్ జేఏసీ కన్వీనర్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి**

ధర్నాచౌక్, అక్టోబర్ 7, ప్రభాతవార్త: పిల్లలలో విద్యా ప్రమాణాలు పెంచుతూ వారి మేధో సామర్థ్యాన్ని పెంచేందుకు, పోషకాహార లోపాన్ని అధికమించేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సీఎం బ్రేక్‌ఫాస్ట్ కార్యక్రమం పేద విద్యార్థులకు వరం లాంటిదని తెలంగాణ అడ్వకేట్ జేఏసీ కన్వీనర్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ సీఎం బ్రేక్ ఫాస్ట్ పథకం దేశానికే ఆదర్శంగా ఉందని కొనియాడారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో తెలంగాణ మధ్య, దిగువ తరగతి ప్రైవేట్ విద్యా సంస్థలు కూడా ప్రత్యక్షంగా, పరోక్షంగా తమవంతు పాత్ర పోషించాయని, వారి విద్యాసంస్థలలో కూడా పేద విద్యార్థులు చదువుతున్నారని గుర్తు చేశారు. వారు కూడా తెలంగాణ బిడ్డలే కాబట్టి భవిష్యత్తులో దిగువ, మధ్య తరగతి విద్యాసంస్థలలో చదివే విద్యార్థులకు కూడా సీఎం బ్రేక్ ఫాస్ట్ పథకాన్ని వర్తింపచేసినట్లయితే సమన్యాయం జరుగుతుందని అన్నారు.

## ఆడపడుచుల పక్షపాతి ముఖ్యమంత్రి కెసిఆర్

**ప్రభుత్వవిప్ అరికెపూడి గాంధీ**



వెంకటేశ్వరనగర్‌లో బతుకమ్మ చీరలను పంపిణీ చేస్తున్న ప్రభుత్వవిప్ అరికెపూడి గాంధీ

కెపిహెచ్‌బి కాలనీ, అక్టోబర్ 7, ప్రభాతవార్త : మహిళ సంక్షేమం కోసం ముఖ్యమంత్రి కెసిఆర్ పలు సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి మహిళా పక్షపాతిగా కొనసాగుతున్నారని ప్రభుత్వవిప్ అరిరెపూడి గాంధీ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన బతుకమ్మ చీరల పంపిణీ కార్యక్రమం వివేకానందనగర్ డివిజన్ పరిధిలో శనివారం జరిగింది. వెంకటేశ్వరనగర్‌లో గల టీజర్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో అరికెపూడి గాంధీ ముఖ్య అతిథిగా పాల్గొని మహిళలకు చీరలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహిళా సంక్షేమం కోసం ముఖ్యమంత్రి కెసిఆర్ కృషి చేస్తూ వస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ రోజాదేవి, మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు జి.సంజీవరెడ్డి, గొట్టిముక్కల పెద్ద భాస్కరరావు, నాయినేని చంద్రకాంతరావు, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బతుకమ్మ చీరెల పంపిణీ



బతుకమ్మ చీరెలను పంపిణి చేస్తున్న ఇన్‌చార్జ్ సిహెచ్.ఆనంద్‌కుమార్‌గౌడ్

బేగంబజార్,అక్టోబర్ 7ప్రభాతవార్త: నాంపల్లి నియోజక వర్గం మల్లేపల్లి డివిజన్ గోకుల్‌నగర్ కమ్యూనిటిహాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రభుత్వ విఫ్ ఎం.ఎస్.ప్రభాకర్‌రావు, నాంపల్లి నియోజకవర్గం బిఆర్ఎస్ ఇన్‌చార్జ్ సిహెచ్.ఆనంద్ కుమా ర్‌గౌడ్‌లు మహిళాలకు బతుకమ్మ చీరెలను అందచేశారు. ఈ కార్య క్రమంలోబిఆర్ఎస్ నాయకులు మాన్‌మోహన్, సంజయ్, మాజీత్,వెంకటేష్ పాల్గొన్నారు.

**గన్‌ఫౌండ్రి..** ప్రతియేటా మాదిరిగానే ఈ యేడుకూడా తెలంగాణ ప్రభుత్వం అందచేస్తున్న బతుకమ్మ చీరెలను పంపణి చేశారు. కోఠి ఫిరోజ్‌గాంధీ పార్క్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమనేత, గోషామహల్ నియోజకవర్గం బిఆర్ఎస్ ఆర్వీమహేం దర్‌కుమార్ మహిళాలకు బతుకమ్మ చీరెలను పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు ఆర్.నరేందర్‌కుమార్,మెగా నాయక్,పిఆర్.నాగశ్రీ,రాధిక తదితరులు పాల్గొన్నారు.



బతుకమ్మ చీరెలను అందచేస్తున్న ఉద్యమ నేత ఆర్వీమహేందర్‌కుమార్

## ట్రాఫిక్ క్లియర్ చేసిన సిఐ

జీడిమెట్ల, అక్టోబర్ 7 ప్రభాతవార్త : జీడిమెట్ల ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు కూడళ్ళలో ఉదయం సమయంలో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సబ్‌స్టేషన్ చౌరస్తాలో ట్రాఫిక్ సిబ్బంది లేకపోవడంతో ప్రయాణికులు ఎవరిదారి వారిదే అన్నట్లుగా వెళ్ళడంతో చౌరస్తా రద్దీమయంగా అయింది. ఉద్యోగస్థులు వారి కార్యాలయాలకు వెళ్ళేందుకు ఆలస్యం అవుతుందని అసహనం వ్యక్తం చేస్తున్నారు. శనివారం సైతం అదే పరిస్థితి నెలకొనడంతో అటుగా వెళ్తున్న జీడిమెట్ల లా అండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ పవన్‌కుమార్ తన వాహనం దిగి ట్రాఫిక్ సిబ్బంది లేకపోవడాన్ని గమనించారు. తానే స్వయంగా విధులు నిర్వర్తించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

## పర్యవరణాన్ని కాపాడుదాం

**డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్**



మొక్కలు నాటుతున్న డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్

నిజాంపేట, అక్టోబర్ 7 ప్రభాతవార్త: నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని విజ్ఞాన్ విద్యాలయం స్కూల్లో ఎన్‌సిసి నేషనల్ క్యాడెట్ కార్ప్స్ విద్యార్థుల ఆధ్వర్యంలో నిర్వహించి హరితహారం కార్యక్రమం డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై కమీషనర్ రామక్రిష్ణరావుతో కలిసి మొక్కలు నాటారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు మొక్కలు నాటి పరిరక్షించుకోవాలని సూచించారు. విజ్ఞాన్ విద్యాలయ యాజమాన్యం ఆచారికుంట రోడ్డుకు ఇరువైపులా మొక్కలను నాటడంతో పాటు కుంట సుందరీకరణ, అభివృద్ధి చేయడానికి ముందుకు రావడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో స్కూల్ వైస్‌చైర్మన్ రాణిరుద్రమ, ప్రిన్సిపాల్ పద్మజ, కార్పొరేటర్లు రాజేశ్వరివెంగయ్య చౌదరి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## నడ్డాకు స్వాగతం పలికిన బిజెపి నేత జూటూరు కీర్తిరెడ్డి



ఫిల్మ్‌నగర్, అక్టోబర్ 7, ప్రభాతవార్త : భాజపా సదస్సులో పాల్గొనేందుకు హైదరాబాద్ వచ్చిన భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షులు నడ్డాకు హైదరాబాద్ సెంట్రల్ జిల్లా భాజపా ఉపాధ్యక్షురాలు జూబ్లీహిల్స్ నియోజకవర్గం నాయకురాలు జూటూరు కీర్తిరెడ్డి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పుష్ప గుచ్ఛం ఇచ్చి శాలువాతో సత్కరించారు. జూబ్లీహిల్స్ నియోజ కవర్గంలో పార్టీ పటిష్టత కోసం తాను చేపడుతున్న కార్యక్రమాలను ఈ సందర్భంగా కీర్తిరెడ్డి నడ్డాకు వివరించారు. జూబ్లీహిల్స్‌లో నియోజకవర్గంలో భాజపాను విజయపథంలో నడిపించాలని నడ్డా కీర్తిరెడ్డికి సూచించారు.

## చంద్రబాబుకు మద్దతుగా కాంతితో క్రాంతి

ధర్నాచౌక్, అక్టోబర్ 7, ప్రభాతవార్త: చంద్రబాబు నాయుడి అక్రమ అరెస్టును నిరసిస్తూ టీడీపీ సికింద్రాబాదు పార్లమెంట్ అధ్యక్షులు పి.సాయిబాబా ఆధ్వర్యంలో కాంతితో క్రాంతి కార్యక్రమం నిర్వహించారు. శనివారం లోయర్‌ట్యాంక్‌బండ్‌లోని టీడీపీ పార్టీ కార్యాలయం వద్ద రాత్రి ఏడు గంటల నుండి ఐదు నిమిషాల పాటు లైట్లను ఆర్పివేసి, కొవ్వొత్తులు, టార్చిలతో చంద్రబాబుకు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శులు నల్లెల్ల కిషోర్, బాలరాజ్‌గౌడ్, నాయకులు కట్టరాములు, ఎస్.ప్రకాష్, భవాని శ్రీనివాస్, సి.హెచ్.ప్రదీప్‌గౌడ్, చంద్రమోహన్ గౌడ్, వై.ఎల్.నర్సింహగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## భారతదేశ తరగని సంపద సంస్కృతి కళలే

**తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ డా. సముద్రాల వేణుగోపాలాచారి**



గురువులను సత్కరిస్తున్న వేణుగోపాలాచారి, దైవజ్ఞశర్మ, రమణారావు, లలితారావు, దామోదర్‌గుప్తా తదితర అతిథులు

రవీంద్రభారతి, అక్టోబరు 7 ప్రభాతవార్త : ప్రపంచంలోనే అత్యుత్తమ 64కళలతో విరాజిల్లుతున్న భారతీయ సంస్కృతి, కళలు దేశానికి కలకాలం నిలిచివుండే తరగని సంపదని స్పష్టం చేసిన తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ డా. సముద్రాల వేణుగోపాలాచారి కళలలోనే ఎంతో శక్తివంతమైన యోగా, వ్యాయామం ఇమిడి ఉన్నాయని, కళాశిక్షణతో మానసిక ఉల్లాసం, ఉత్సాహం, ధృడత్వం, సంపూర్ణ ఆరోగ్యం, చైతన్యం, పట్టుదల, కార్యదీక్ష దక్షత పెరిగి అన్నిరంగాల్లో అత్యున్నతస్థాయికి చేరుకొంటారని, అందుకే తల్లిదండ్రులు విధిగా పిల్లలకు వారికిష్టమైన కళలను తప్పక నేర్పించాలని, అందుకు సహరిస్తున్న గురువులను వేణుగోపాలాచారి అభినందించి చిన్నారి కళాకారులను, సకల కళాసంబరాలు శీర్షిక భారత్ ఆర్ట్స్ అకాడమీ, ఏబిసి ఫౌండేషన్లు ఏర్పాటుచేసి కళలు, కళాకారులను ప్రోత్సహిస్తున్న లయన్ కె.వి.రమణారావు, లలితారావులను అభినందించారు. మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా రవీంద్రభారతి ప్రధాన మందిరంలో కె.వి.రమణారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన వేణుగోపాలాచారి విశిష్ట అతిథులు దైవజ్ఞశర్మ, కోలేటి దామోదర్‌గుప్తా, నటీమణులు సోని, రోజా, ఎల్.నరేష్‌లు, వెంకటేష్ పాల్గొన్నారు.

## సుస్థిర పాలన అందించడమే లక్ష్యం: ఎమ్మెల్యే

**దుండిగల్ మున్సిపల్ పరిధిలో రూ.2కోట్ల55లక్షల అభివృద్ధి పనులకు శంకుస్థాపన**



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

దుండిగల్, అక్టోబర్ 7 ప్రభాత వార్త: ప్రగతియాత్ర 124వ రోజులో భాగంగా దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని గాగిల్లాపూర్, చర్చిగాగిల్లాపూర్, దుండిగల్, తాండాలు, డి.పోచంపల్లిలోని వివిధ కాలనీల్లో ఎమ్మెల్యే వివేకానంద్ శనివారం పాదయాత్ర నిర్వహించి రూ,2కోట్ల55లక్షల నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు సుస్థిర పాలన అందించడమే లక్ష్యంగా కేసిఆర్ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఎవరు అంచనా వేయని విధంగా ప్రజా సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతూ దేశంలోనే నంబర్ రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దిన ఘనత సిఎం కేసిఆర్‌కే దక్కుతుందని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో ఎన్ని నిధులైనా కేటాయించి అభివృద్ధి మరింత వేగవంతం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ పద్మారావు, మున్సిపల్ బిఆర్ఎస్ అధ్యక్షులు సంజీవరెడ్డి, కౌన్సిలర్లు జక్కుల క్రిష్ణయాదవ్, గోపాల్‌రెడ్డి, సీనియర్ నాయకులు సుధాకర్‌రెడ్డి, మురళి, భీమ్‌సింగ్, జగన్, మోహన్‌నాయక్, నాయకులు, ఆయా కాలనీవాసులు పాల్గొన్నారు.

## దేవాలయాలకు మానసిక ప్రశాంతతకు నిలయాలు

**బీజేపీ రాష్ట్ర నాయకులు అంజన్ కుమార్**



నార్సింగిలో సంకట హరణ హనుమాన్ దేవాలయం అన్నదాన మండపం, అన్నపూర్ణ దేవి విగ్రహ ప్రతిష్టాపనోత్సవంలో పాల్గొన్న భక్తులు

నార్సింగి, అక్టోబర్ 7 ప్రభాతవార్త : దేవాలయాలు మానసిక ప్రశాంతతకు నిలయాలని, క్రమం తప్పకుండా ఆలయ దర్శనం చేసుకునే వారు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని బీజేపీ రాష్ట్ర నాయకులు అంజన్ కుమార్‌గౌడ్ పేర్కొన్నారు. శనివారం నార్సింగిలోని సంకట హరణ హనుమాన్ దేవాలయంలో అన్నదాన మండపం, అన్నపూర్ణ దేవీ విగ్రహ ప్రతిష్టాపనోత్సవం వేద పండితుల మంత్రోచ్చరణలు, మంగళ వాయిద్యాల మధ్య ఆగమశాస్త్రాను సారంగా ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ఆలయ కమిటీ చైర్మన్, బీజేపీ రాష్ట్రనేత అంజన్ కుమార్ గౌడ్ ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేవాలయాలు అంతరిక్షంలోని కాస్మోటిక్ ఎనర్జీని ఆలయంలోకి లాగి నిక్షిప్తం చేస్తాయని, అలాంటి ఆలయాలకు మనం వెళ్లినప్పుడు ఆ కాస్మోటిక్ ఎనర్జీ మనపై ప్రసరించి మనలోని రుగ్మతలు తగ్గిపోతాయన్నారు. మనలో నూతనోత్తేజం వస్తుందని, మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. మన సనాతన ధర్మంలోని ప్రతీ చర్య మనకు మేలు చేసేదే ఉంటుందని, దాన్ని సానుకూలంగా ఆచరించడం వలన అనేక లాభాలు కలుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో నార్సింగి మున్సిపల్ బిజేపి అధ్యక్షులు చిక్కిరి బిక్షపతి ఆయదవ్, ఆలయ కమిటీ సభ్యులు కృష్ణస్వామి ముదిరాజ్, నందు, శ్రీనివాస్, జైపాల్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, రాజు, అశోక్, శ్రీనివాసులు, కోటేశ్వర్‌రావ్, గోపాల్‌రావ్, సుబ్బారావ్ తదితరులు పాల్గొన్నారు.

### శాంతి మత సామరస్యం కోసం ప్రతీ ఒక్కరూ కృషి చేయాలి

మైలార్‌దేవ్‌పల్లి, అక్టోబరు 7 ప్రభాతవార్త : శాంతి మత సామరస్యం కోసం ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని రాజేంద్రనగర్ డిసిపి జగదీశ్వర్‌రెడ్డి అన్నారు.రాజేంద్రనగర్ డిసిపి కార్యాలయంలో శనివారం డిసిపి జగదీశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ గణేష్ ఉత్సవ సమితి ఆత్మీయ సన్మాన కార్యక్రమం జరిగింది.డిసిపి జగదీశ్వర్‌రెడ్డి,ఎసిపి గంగాధర్,జిహెచ్ఎంసి రాజేంద్రనగర్ డిసి రవి కుమార్‌తో పాటు పలువురు అధికారులను రాజేంద్రనగర్ గణేష్ ఉత్సవ సమితి ఉపాధ్యక్షులు నారగూడెం మల్లారెడ్డి సన్మానించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణేష్ నిమజ్జనం ఉత్సవాలు ప్రశాంతమైన వాతావరణంలో జరగటానికి సహకరించిన అందరికి ధన్యవాదాలు తెలిపారు.

### నిరసనలు తెలపండి

కెపిహెచ్‌బి కాలనీ, అక్టోబర్ 7, ప్రభాతవార్త : నో పేమెంట్ నోవర్క్ నినాదంతో కాంట్రాక్టర్స్ చేస్తున్న సమ్మెలో భాగంగా కూకట్‌పల్లి సర్కిల్ ఆఫీస్‌లో మెయిన్‌గేట్‌లకు లేదా ఎంట్రన్స్ దగ్గర జోనల్ వైస్‌గా స్టాపింగ్ ఆఫ్ వర్క్ బ్యానర్ పెట్టాలని కూకట్‌పల్లి కాంట్రాక్టర్స్ అసోసియేషన్ తీర్మానించింది.

## స్కూటీపై వెళుతున్న భార్యను వెంబడించి.. బండరాయితో మోది హత్య చేసిన భర్త

వనస్థలిపురం, అక్టోబరు 7 ప్రభాతవార్త: కుటుంబ కలహాలతో స్కూటిపై వెళుతున్న భార్యను భర్త వెంబడించి బండరాయితో తలపై మోది హత్య చేసిన సంఘటన వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం ఆంధ్రప్రదేశ్ ప్రకాశం జిల్లా కొనిజేడు గ్రామానికి చెందిన తన్నీరు షాలిని (32)ను అదే జిల్లాకు చెందిన సంతనూతలపాడు గ్రామానికి చెందిన బాలకోటయ్య (43)తో 15 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. గత కొన్ని సంవత్సరాల క్రితం బాల కోటయ్య దంపతులు నగరానికి వచ్చి వనస్థలిపురంలో నివాసముంటున్నారు. బిల్డర్ వృతి లోఓ ఉన్న బాలకోటయ్యకు ఇద్దరు కుమారులు, 6 నెలల క్రితం మునగనూరులో స్వంత ఇల్లు నిర్మించుకుని బాలకోటయ్య దంపతులు నివాసముంటున్నారు. కాగా కొంతకాలంగా భార్యభర్తలమధ్య గొడవులు జరుగుతున్నాయి. ఇద్దరి మధ్య గొడవలు తీవ్రమవడంతో బాలకోటయ్య స్వంత ఊరికి వెళ్లాడు. శుక్రవారం ఊరునుండి తిరిగి వచ్చిన బాలకోటయ్య షాలినికోసం ఎదురు చూస్తున్నాడు. షాలిని మునగనూరునుండి స్కూటిపై శుక్రవారం రాత్రి తల్లిదండ్రులు నివాసముంటున్న విజయపురి కాలనీ ఫేజ్1కు వెళుతుంది అది గమనించిన బాలకోటయ్య స్కూటీపై వెళుతున్న భార్యను వెంబడించి దారిలో అడ్డగించి గొడవకు దిగాడు. స్కూటీపైనుండి షాలినిని నెట్టివేయడంతో ఆమె కింద పడింది. వెంటనే కోటయ్య బండరాయితో ఆమె తలపై మోదడంతో షాలిని మృతి చెందింది. అనంతరం బాలకోటయ్య అక్కడినుండి పరారయ్యాడు.సమాచారం అందుకున్న వనస్థలిపురం పోలీసులు సంఘటనా స్థలానికి వచ్చి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

### కుటుంబ కలహాలతో బావ మరిదిపై కత్తితో దాడి

చార్మినార్,అక్టోబరు 7 ప్రభాతవార్త : కుటుంబ కలహాలతో బావ తన సొంత బావ మరిదిపై కత్తితో దాడి చేసి గాయ పరిచిన సంఘటన పాతబస్తీ హుస్సేనీఆలం పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది.హుస్సేనీఆలం పోలీసులు కథనం ప్రకారం.. పాతబస్తీ భవానీనగర్‌కు చెందిన రషీద్ (40) కాంట్రాక్టర్.కాగా రషీద్ సోదరితో నవాబ్ సాహెబ్‌కుంటకు చెందిన ఖలీల్ వివాహం జరిగింది.భార్యా భర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి.కొద్ది రోజుల క్రితం రషీద్ ఇంటికి ఖలీల్‌ను పిలిపించి నచ్చజెప్పారు. కాగా శనివారం మధ్యాహ్నం రషీద్ కిల్వత్‌లోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో చదువుచున్న తన పిల్లల స్కూల్ ఫీజులు కట్టిన అనంతరం వాహనంపై అబిడ్స్ వెళుతున్నాడు. కిల్వత్ రహదారిలో ఖలీల్ కత్తితో రషీద్ భుజంపై దాడి జరిపాడు.ఈ సంఘటనలో గాయాల పాలైన రషీద్ ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.ఈ కేసును హుస్సేనీ ఆలం పోలీసులు అన్ని కోణాలు నుంచి దర్యాప్తు చేస్తున్నారు.

## తెలుగు సినీగీతాల సువాసనలను గుబాళించిన గాయని విజయలక్ష్మిశర్మ

**తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతికశాఖ సంచాలకుడు డా. మామిడి హరికృష్ణ**



అక్కినేని స్మారక సంగీత పురస్కారంతో విజయలక్ష్మిశర్మను సత్కరిస్తున్న మామిడిహరికృష్ణ, సారిపల్లి, లంక, కృష్ణకుమారి

రవీంద్రభారతి, అక్టోబరు 7 ప్రభాతవార్త : తెలుగు చలన చిత్రసీమలో తన మధురమైన గళంతో ఆణిముత్యాల్లాంటి అక్కినేని నటించిన చిత్రాలతోసహా వందలకుపైగా సుమధుర గీతాలను ఆలపించి శ్రోతలను మైమరపింపజేసిన ప్రముఖ గాయని విజయలక్ష్మిశర్మ అని తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతికశాఖ సంచాలకుడు డా. మామిడి హరికృష్ణ అభివర్ణించారు. తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతికశాఖ సౌజన్యంతో రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో డా. అక్కినేని నాగేశ్వరరావు శతజయంతి సందర్భంగా సారిపల్లి కొండలరావు సభాధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి సంస్థ అధ్యక్షుడు లంక లక్ష్మీనారాయణ సభకు స్వాగతం పలుకగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న డా. మామిడి హరికృష్ణ విశిష్ట అతిథులు డా. కె.వి.కృష్ణకుమారి, లంక లక్ష్మీనారాయణ, హిప్నో పద్మకమలాకర్, విజయదుర్గ, సివిఆర్ మాణికేశ్వరి, జి.పల్లవి, ఎస్వీ రామారావు తదితరులతో కలిసి ప్రముఖ గాయని సి.విజయలక్ష్మిశర్మను ఘనంగా సత్కరించి అక్కినేని స్మారక సంగీత పురస్కారం ప్రదానంచేసి ఎంతగానో అభినందించారు. సభకుముందు సాంస్కృతిక కార్యక్రమంలో ప్రముఖ గాయనీమణుల నోట ఆణిముత్యాలైన అక్కినేని పాట శీర్షికన సినీసంగీత విభావరి ఆహుతులైన అశేష సంగీతప్రియులు, అక్కినేని అభిమానులు, ఔత్సాహిక ప్రేక్షకులను సంగీతలోకంలో విహరింపజేసి మంత్రముగ్ధులను చేసింది.

**బహిరంగ ప్రకటన**

సాధారణ ప్రజానీకానికి ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా మా క్లయింట్లు 1. కర్రే శ్రీనివాస్ తండ్రి కె. బాలకిష్టయ్య, 2. కె.వెంకటేష్ తండ్రి కె.బాలకిష్టయ్య, ఇరువురి నివాసం ఇ:నం.4-71,పెద్దషాపూర్ గ్రామం, శాంషాబాద్ మండలం, రంగారెడ్డి జిల్లా, 3. శ్రీమతి ఐ.ఉమాదేవి ,తండ్రి కె.బాలకిష్టయ్య, రజేంద్రనగర్ మండలం రంగారెడ్డి జిల్లా, 4. శ్రీమతి .అండాలు తండ్రి కె.బాలకిష్టయ్య, నివాసం ఇ:నం.3-96/1 అజీజ్‌నగర్, మోయినాబాద్ మండలం, రంగారెడ్డి జిల్లా, 5.శ్రీమతి.ఏ నిర్మలా తండ్రి కె.బాలకిష్టయ్య, ఇ:నం.4-72,పెద్దషాపూర్ శాంషాబాద్ మండలం, రంగారెడ్డి జిల్లా, నివాసులు మరియు ,1.శ్రీమతి కర్రే బాలామ్మ & ఇతరుల మధ్య వ్యవసాయ భూమి సర్వే నెం,239, ఎకరాలు,13-24 గుంటలు పెద్దషాపూర్ విలేజ్ శాంషాబాద్ మండలం ,రంగారెడ్డి జిల్లా, తెలంగాణ . సరిహద్దులు: ఉత్తరం: అమిత్ టిబ్రేవాలా భూమి. దక్షిణం: పి.ఎస్.ఆర్.కాలేజీ, పడమర :జి.పి.ఆర్.వెంచర్. తూర్పు: ఓపెన్ ప్లాట్ సర్వే నెం,225.ఇట్టి భూమిపై గౌరవనీయులైన 12వ అదనపు జిల్లా జడ్జీ రంగారెడ్డి జిల్లా ఎల్.బి.నగర్ కోర్టులో ఒ.ఎస్.నెం :1053 / 2012, I.A.No.740 of 2020 ఫైనల్ డిక్రి కోర్కై దావ నడుచుచున్నది, కావున యావత్ ప్రజానీకానికి ఇందుమూలముగా హెచ్చరించుట ఏమనగా పై తెలుపబడిన భూమిని ఎవరైన ఎలాంటి లావాదేవీలు,క్రయ విక్రయా లు జరుపుటకు ప్రయత్నించిన వారిపై చట్టపరమైన సివల్ మరియు క్రిమినల్ కేసులు వేయబడునని ఈ బహిరంగ ప్రకటన ద్వార హెచ్చరించడమైనది.

సం/-

జి రమేష్ ,నరసిముడు

అడ్వకేట్లు

ఆఫీస్ నెం.1,ముంబై కాంప్లెక్స్,మెగా థియేటర్ ప్రక్కన దిల్‌సుఖ్ నగర్ హైదరాబాద్ -500059, ఫోన్: 9505450729

## బాలికలను చదివిస్తేనే మహిళా సాధికారత సాధ్యం

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి అక్టోబరు 7, ప్రభాతవార్త :** బాలికలను చదివిస్తేనే మహిళా సాధికారత సాధ్యం అవుతుందని, మహిళలకు చట్టాలు-హక్కులపై అవగాహన అవసరమని కోఆర్డినేటర్ ప్రియాంక పేర్కొన్నారు. శనివారం మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని జీడిమెట్ల ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడి కేంద్రంలో భేటి బచావో-భేటి పడావో (బాలికలను రక్షిద్దాం-బాలికలను చదివిద్దాం), మహిళలకు చట్టాలు, హక్కులుపై విద్యార్థినిలకు, మహిళలకు అవగాహన సదస్సును నిర్వహించారు. మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా సంక్షేమ శాఖ అధికారి ఎం.కృష్ణారెడ్డి పర్యవేక్షణలో అవగాహన సదస్సు జరిగింది. కోఆర్డినేటర్ ప్రియాంక మాట్లాడుతూ ఆడపిల్లలు అన్ని రంగాలలో రాణించేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని బాలికలను చదివిస్తేనే మహిళా సాధికారత సాధ్యం అవుతుందన్నారు. మహిళలకు చట్టాలు-హక్కులపై మరింత అవగాహన పొందాలన్నారు. దీనిలో బాలికలకు బాల్యవివాహాలు, బాలకార్మిక చట్టాలు, గృహహింస చట్టం, ఫోక్సో చట్టం, చైల్డ్ లైన్, సఖి సెంటర్, హెల్ప్ నంబర్లు 100, 181, 1098, 14567పై అవగాహనను కల్పించారు. ఈ కార్యక్రమంలో మహిళా సాధికారత బృందం సభ్యులు సిడిపిఒ హెప్సిబా, ఏసిడిపిఒ ప్రియాంక, సూపర్‌వైజర్ కృష్ణప్రియ, వాసవి, సునిత, అంగన్‌వాడి టీచర్లు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## రమేష్ మహారాజ్ బలపర్చిన వ్యక్తికే మా మద్దతు

**యాలాల, అక్టోబరు 7, ప్రభాతవార్త :** తాండూరు కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ రమేష్ మహారాజ్ బలపర్చిన వ్యక్తికే తమ పూర్తి మద్దతు తెలపనున్నట్లు యాలాల మండల కాంగ్రెస్ పార్టీ నేతలు ప్రకటించారు. శనివారం యాలాల మండల పార్టీ అధ్యక్షులు మేడికొండ నర్సిరెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఎంపిక తీర్మాన పత్రాన్ని మీడియాకు అందజేశారు. రారున్న అసెంబ్లీ ఎన్నికల్లో తాండూరు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా రమేష్ మహారాజ్‌కు కాని లేక వారు బలబరిచిన కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డికి తాండూరు టిక్కెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. పార్టీ అధిష్టానం వలస నేతలకు టిక్కెట్ ఇచ్చిన యెడల ఎట్టి పరిస్థితిల్లోను మద్దతు తెలపమని స్పష్టం చేశారు. గత ఎన్నికల్లో బిఆర్ఎస్ నుండి కాంగ్రెస్‌లోకి వచ్చిన రోహిత్‌రెడ్డిని గెలిపించి మోసపోయిన సంగతిని వారు గుర్తు చేశారు.

## దసరా నవరాత్రి ఉత్సవాలకు రావాలని ఆహ్వానం

**కీసర, అక్టోబరు7, ప్రభాతవార్తః**

దసరా నవరాత్రి ఉత్సవాలకు రావాలని కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు నక్క ప్రభాకర్ గౌడ్‌ని నాగారం మున్సిపాలిటీ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు ముప్పు శ్రీనివాస్‌రెడ్డి శనివారం ఆయన నివాసంలో కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు పంగ హరిబాబు, మాజీ సర్పంచ్ గూడూరు అశోక్ గౌడ్, నాయకులు రఘు యాదవ్, రాజిరెడ్డి, శేఖర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## బిసి కులవృత్తుల వారు ఆర్థికంగా ఎదగాలి : మహేందర్‌రెడ్డి

**శామీర్‌పేట, అక్టోబరు 7, ప్రభాతవార్త**

సిఎం కెసిఆర్ బిసి కులవృత్తుల, చేతివృత్తుల వారిని ఆర్థికంగ ఆదుకోవటానికి బిసి బంధును తీసుకవచ్చారని లబ్దిదారులు సద్వినియోగం చేసుకోవాలని మేడ్చల్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి చామకూర మహేందర్‌రెడ్డి సూచించారు. శనివారం శామీర్‌పేట మండలంలోని వివిధ గ్రామాల వారికి మంత్రి మల్లారెడ్డి సమక్షంలో బిసి బంధు చెక్కుల పంపిణీ కార్యక్రమం జరిగిందని ఆయన వివరించారు. బిసి బంధు చెక్కు మంజూరు కావటంతో శామీర్‌పేట ప్రాంతానికి చెందిన వారికి మేడ్చల్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి సిహెచ్ మహేందర్‌రెడ్డి బిసి బంధు చెక్కులను అందజేశారు. శామీర్‌పేట మండల బిఆర్ఎస్ అధ్యక్షులు వి.సుదర్శన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం బిసి కులవృత్తులకు ప్రాధాన్యత ఇస్తూ ఆర్థికంగ ఆదుకుంటుందని లక్ష రూపాయలు బిసి బంధు ద్వారా అందటం లబ్దిదారుల అదృష్టమని అన్నారు. లబ్దిదారులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని, బిసి బంధు చెక్కులను మంజూరు చేసిన మంత్రి మల్లారెడ్డికి, నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి మహేందర్‌రెడ్డికి మండల బిఆర్ఎస్ అధ్యక్షులు వి.సుదర్శన్ దన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శామీర్‌పేట వార్డుసభ్యులు డి.నవీన్, బిఆర్ఎస్ నాయకులు సోనీ, లబ్దిదారులు, తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ మనముదిరాజ్ మహాసభ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా లక్ష్మణ్

**శామీర్‌పేట, అక్టోబరు 7, ప్రభాతవార్త**

తెలంగాణ మనముదిరాజ్ మహాసభ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా మంచీనీళ్ల లక్ష్మణ్ (అలియాబాద్) నియమితులయ్యారు. తెలంగాణ మనముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ చొప్పరి శంకర్ ముదిరాజ్ ఆయనను నియమిస్తూ నియామక పత్రాన్ని అందేశారు. శామీర్‌పేట మండలంలోని అలియాబాద్ గ్రామానికి చెందిన మంచినీళ్ల లక్ష్మణ్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా నియమితులైన సందర్భంగ ఆయనకు దన్యవాదాలు తెలిపారు. ముదిరాజ్ కులాన్ని జాతిని ఐక్యం చేస్తూ జిల్లా కమిటీలను, రాష్ట్ర అనుబంధ విభాగాలను నిర్మాణం చేయటం ద్వారా ముదిరాజ్‌లలో చైతన్యం, అభ్యున్నతికి, పురోగతికి, సంక్షేమానికి విద్య, ఉద్యోగాల, సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక రంగాలలో పురోభివృద్ధికి కృషి చేయాలని రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగ నియమితులైన మంచినీళ్ల లక్ష్మణ్‌కు రాష్ట్ర అధ్యక్షులు శంకర్ ముదిరాజ్ సూచించారు.

## పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ కార్యాలయ ముట్టడిని విజయవంతం చేయాలి

**మేడ్చల్, అక్టోబర్ 7. ప్రభాతవార్త ః** గొర్రెల పెంపకందార్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 9 నిర్వయించే రాష్ట్ర పశుసంవర్థక శాఖ డైరెక్టర్ కార్యాలయ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గొర్రెల, మేకల పెంపకందార్ల సంఘం జిల్లా కార్యదర్శి ఎల్కల దేవి కొమురయ్య కోరాడు. మేడ్చల్ మండలంలోని డబిల్‌పూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ గొర్రెల పెంపకం దార్లు అనేక సమస్యలతో సమమతమౌతున్నారని, సబ్సిడీ గొర్రెలు ఇంకా అందక జిల్లా వ్యాప్తగా 1150 మంది ఎదురు చూస్తున్నారని అన్నాడు. ఇప్పటికే అందిన యూనిట్లల్లో నాసి రకం గొర్రెలు రావడంతో అవకు ఈతకు కూడ పనికిరాకుండా ఉన్నాయని ఆరోపించాడు. ఈ పథకంలో నగదు బదిలీ పథకం అమలు చేయాలని డిమాండ్ చేశాడు. ఈ కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు పెద్ద కృష్ణ, నాయకులు గంగారాం, నర్సింగ్ రావు, వార్డు సభ్యులు నవనీత నాగేశ్వర్, సాయి నాథ్, మణికాత్, జిల్లా నాయకుడు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

### -సిఐటియూ జిల్లా కార్యదర్శి ఎర్ర అశోక్

**మేడ్చల్, అక్టోబర్ 7. ప్రభాతవార్త ః** మధ్యాహ్నభోజన కార్మికుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చి, పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే మంజూరి చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షుడు ఎర్ర అశోక్ డిమాండ్ చేశాడు. మధ్యాహ్న భోజన కార్మికుల సమ్మెలో భాగంగా శనివారం మేడ్చల్‌లో కార్మికులు ఖాళీ ప్లేట్లతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమ్మెతో విద్యార్థులు పడుతున్న ఇబ్బందిని గుర్తించి వెంటనే సమస్యను పరిష్కరించాలని లేని ఎడల ఈ సమ్మెను మరింత ఉదృతం చేస్తామని ఆయన హెచ్చరించాడు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షురాలు ప్రేమలత, కార్మికులు విజయ, భాగ్యమ్మ, పద్మమ్మ, శ్యామల, నర్సమ్మ, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ అభివృద్ధికి కృషి : చైర్‌పర్సన్ దీపిక నర్సింహారెడ్డి

**మేడ్చల్, అక్టోబర్ 7. ప్రభాతవార్త ః** మున్సిపాలిటీని అన్ని రకాల అభివృద్ధి పరుస్తున్నామని మేడ్చల్ మున్సిపల్ చైర్మన్ దీపిక నర్సింహారెడ్డి అన్నారు. మున్సిపల్ పరిధిలోని 2 వ వార్డులో రూ.20 నిధులతో చేపడుతున్న సిసి రోడ్డు నిర్మాణ పనులను స్థానిక కౌన్సిలర్ దేవతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మున్సిపాలిటీలో సిసి రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనెజీ వ్యవస్త, వీది దీపాలు, ఇంటింటికి నల్లా నీరు అందించి సమస్యలు లేకుండా చూస్తున్నామని తెలిపారు. ఇంటింటి నుంచి చెత్తను సేకరించి, పరిశుభ్రంగా ఉంచే విదంగా అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మున్సిపల్ కమిషనర్ త్రిల్లేశ్వర్ రావు, మాజీ ఉప సర్పంచ్ నర్సింహారెడ్డి, బిఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షుడు వీరభద్రారెడ్డి, పార్టీ వార్డు అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వినతి

**జిల్లెడు చౌదరిగూడ, అక్టోబర్ 07,(ప్రభాతవార్త):** మధ్యాహ్న బోజన కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతు శనివారం ఎంపిడిఓ మహెష్‌బాబుకు ఏఐటియుసి నాయకులు, కార్మికులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటీయుసి జిల్లా అధ్యక్షుడు టంగుటూరి నర్సింహారెడ్డి, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్దుల జంగయ్యలు మాట్లాడుతూ మధ్యహ్న బోజన కార్మికులకు నెలకు రూ.26వేల వేతనం ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మధ్యహ్న బోజన కార్మికులు చోటు, రమేష్, రాధ, శశిధర్‌బాబు, బుచ్చమ్మ, శేఖర్‌గౌడ్, శశికళ, జాంగిర్‌బీ, షరీఫా, మంజుల, యాదమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలు దేశానికే ఆదర్శం : మహేందర్ రెడ్డి

**షాబాద్, అక్టోబర్ 7, ప్రభాతవార్త :**

తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని సమాచార పౌర సంబంధాలు, గనుల శాఖ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. శనివారం షాబాద్ మండలంలో హైతాబాద్ గ్రామపంచాయతీ అనుబంధ గ్రామమైన అంకుగూడ, పోతుగల్ నుండి మాచన్‌పల్లి, గోపిగడ్డ నుండి పోలారం గ్రామాలకు రూ.8కోట్ల65లక్షలతో బీటీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే కాలె యాదయ్య, జడ్పీటీసీ పట్నం అవినాష్‌రెడ్డి, ఎంపీపీ కోట్ల ప్రశాంతిమహేందర్‌రెడ్డిలతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి ఏదో ఒక రూపంలో అందుతున్నాయన్నారు. రాష్ట్రంలోని అతిపెద్ద పారిశ్రామిక హబ్‌గా చందన్‌వెల్లి, సీతారాంపూర్ రూపాంతరం చెందుతుందన్నారు. చందన్‌వెల్లి పారిశ్రామికవాడలో ప్రతిష్టాత్మకమైన అమెజాన్, వెల్స్పన్, కుందన్, కటెరా, మైక్రోసాఫ్ట్ వంటి కంపెనీలు ఈ ప్రాంతవాసులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తుందన్నారు. అలాగే సీతారాంపూర్‌లోని పారిశ్రామికవాడలో పారిశ్రామిక కంపెనీ అయిన వోలెక్ట్రా ఎలక్ట్రానిక్ వెహికిల్ ఉత్పత్తి ప్లాంట్, కిటెక్స్ కంపెనీ ద్వారా సుమారు 15వేల మంది మహిళలకు ఉపాధి లభిస్తుందన్నారు. భవిష్యత్‌లో షాబాద్ మండలం ప్రపంచస్థాయిలో గుర్తింపు వచ్చే అవకాశం ఉందన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలతో ఇక్కడి రైతులకు త్వరలోనే నీరు వస్తుందన్నారు. ఈకార్యక్రమంలో మండల కోఆప్షన్ సభ్యులు చాంద్‌పాషా, ఏఎంసీ చైర్మెన్ నర్సింగ్‌రావు, మాజీ ఏఎంసీ చైర్మెన్లు శ్రీనివాస్‌గౌడ్, వెంకటయ్య, పొన్న నర్సింహ్మారెడ్డి, ఎస్టీసెల్ మండల అధ్యక్షుడు గోపాల్‌నాయక్, సర్పంచ్‌లు మల్లేష్, ప్రభాకర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, మంగమ్మ, కవిత, దర్శన్, ఉపసర్పంచులు గోపాల్, శివకుమార్, నాయకులు నర్సింహ్మారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, సూద యాదయ్య, శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణగౌడ్, దేవేందర్‌రెడ్డి, రాజు, శివకుమార్, బల్వంత్‌రెడ్డి, నర్సింలు, జంగయ్య, శ్రీరాంరెడ్డి, మల్లేష్, యాదయ్య, దర్శన్, రాజు తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి

# పత్తి రైతులకు ఎటువంటి నష్టం వాటిల్లకుండా చర్యలు తీసుకోవాలి : కలెక్టర్ హరీష్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ హరీష్.

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి హైదారాబాద్ అక్టోబర్ 7 ప్రభాతవార్త :**

పత్తి రైతులకు ఎటువంటి నష్టం వాటిల్లకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ హరీష్ పేర్కొన్నారు. శనివారం కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లాస్థాయి కాటన్ ప్రొక్యూటర్‌మెంట్‌పై జిన్నింగ్ మిల్లర్లు, బ్రాంచ్ మేనేజర్ కాటన్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా, మహబూబ్‌నగర్, మార్కెట్ కమిటీ సెక్రటరీలు, ట్రాన్స్ కో అదికారులు, లీగల్ మెట్రాలజీ అదికారులతో జిల్లా కలెక్టర్ హరీష్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ హరీష్ మాట్లాడుతూ...కాటన్ కొనుగోలు వలస రైతులకు ఎటువంటి నష్టం వాటిల్లకుండా మార్కెటింగ్ సిబ్బంది తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పత్తిని పండించే రైతులు ఆధార్ అథెంటికేషన్, ఆధార్ బ్యాంకు లింకేజీ చేసుకునేలా చూడాలన్నారు. చిన్న రైతులకు ఎటువంటి నష్టం వాటిల్లకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని వెల్లడించారు. రైతులు వారికి కేటాయించిన మిల్లులకే పత్తిని పంపించాలని, ఏమైనా సమస్యలు ఎదురైతే వెంటనే పరిష్కరించాలని అదికారులకు సూచించారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు సౌకర్యాలు కల్పించాలని, పత్తి మిల్లుల్లో పనిముట్లు పనితీరును సదుపాయం తనిఖీ చేయవలసిందిగా సంబందిత అదికారులకు ఆదేశించారు. 2023, 24 సంవత్సరమునకు జిల్లాలో సాగు చేయబడిన పత్తి దిగుబడులను అంచనా వేసి కనీసం మద్దతు ధర రూ.7,020గా నిర్ణయించబడినదని తెలిపారు. జిల్లాలో 15 సిసిఐ పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిందన్నారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాలకు పత్తిని తరలింపు విషయంలో రైతులకు అవగాహన కల్పించాలని వ్యవసాయశాఖ అదికారికి సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ భూపాల్ రెడ్డి, మార్కెటింగ్ అధికారి ఛాయా దేవి, వ్యవసాయ అదికారి గీతరెడ్డి, బ్రాంచ్ మేనేజర్ కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, మహబూబ్ నగర్, జిన్నింగ్ మిల్లర్లు, మార్కెట్ కమిటి కార్యదర్శి, అగ్నిమాపక అధికారి, ట్రాన్స్ కో అదికారులు, లీగల్ మెట్రాలజి అధికారులు, మిల్లర్ల అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# ప్రసాద్‌కుమార్ పై అసత్య ఆరోపణలు చేస్తే సహించేది లేదు : కాంగ్రెస్

**వికారాబాద్, అక్టోబర్ 07, ప్రభాతవార్త:**

మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్ పై స్థానిక ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ అసత్య ఆరోపణలు చేస్తే సహించేది లేదని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు అర్థ సుధాకర్‌రెడ్డి హెచ్చరించారు. శనివారం ప్రసాద్‌కుమార్ నివాసంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ, అవినీతి మంత్రి అని ప్రసాద్‌కుమార్ పై ఆరోపణలు చేసే ముందు ఒక్కసారి ఆలోచించాలని, రాబోయే ఎన్నికల్లో పోటీ చేసేందుకు ప్రసాద్‌కుమార్ వద్ద డబ్బులు లేవని అన్న బీఆర్ఎస్ నాయకులే అవినీతి మంత్రి అని ఎలా అంటారని ఆయన ప్రశ్నించారు. స్థానిక ఎమ్మెల్యే ఆనంద్‌పైనే 300 ఎకరాలు కబ్జా చేశారని, 300 కోట్లు సంపాదించారని నియోజకవర్గ ప్రజలు కోడై కూస్తున్నారని ఆరోపించారు. 9 ఏండ్లల్లో గుర్తు రాని వికారాబాద్ రైల్వే ఓవర్ బ్రిడ్జీ పనులు, ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో ఎలా గుర్తుకు వచ్చాయని ప్రశ్నించారు. బ్రిడ్జీ పనులతో వికారాబాద్ పట్టణ ప్రజల నుంచి ఓట్లు దండుకునేందుకే ఎత్తగడ వేశారని ఆరోపించారు. బ్రిడ్జీ పనులకు ప్రతిపాదనలు పంపి, ఆన్‌లైన్ టెండర్ ప్రక్రియ పూర్తి అయిన తర్వాత శంఖుస్థాపనలు చేయాలని, అవేవి చేయకుండా కేవలం ఎన్నికల్లో ఓట్లు దండుకునేందుకు ఆదరాబాదరగా బ్రిడ్జీ పనులకు శంకుస్థాపని చేశారని తీవ్రంగా విమర్శించారు. మారో సారి మాజీ మంత్రి ప్రసాద్ కుమార్‌పై అసత్య ఆరోపణలు చేస్తే ఊరుకునే ప్రసక్తి లేదని హెచ్చరించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ మైనార్టీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.వాహీద్, కౌన్సిలర్ మురళి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు మహిపాల్‌రెడ్డి, ఎర్రవల్లి జాఫర్, జంగయ్య, రెడ్యానాయక్, రఘుపతిరెడ్డి, చాపల శ్రీనివాస్, రాంచెంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు సుధాకర్‌రెడ్డి

## 15వ వార్డులో 60లక్షలతో సీసీ రోడ్డు

**ఆమనగల్లు, అక్టోబర్07, ప్రభాతవార్త:** ఆమనగల్లు మున్సిపాలిటీలోని 15వ వార్డులో 60లక్షల నిధులతో 500మీటర్ల పొడవున నూతనంగా నిర్మిస్తున్న సీసీరోడ్డు పనులకు శుక్రవారం మున్సిపాలిటీ పాలకవర్గం భూమిపూజ చేశారు. కౌన్సిలర్ చెక్కాల లక్ష్మణ్ అధ్యక్షతన జరిగిన భూమిపూజ కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర సీనియర్ నేత, జాతీయ ఓబీసీ కమీషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి, చైర్మన్ రాంపాల్‌నాయక్, వైస్ చైర్మన్ భీమనపల్లి దుర్గయ్యలు హాజరై, భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. ఆదర్శనగర్, శివాలయంకాలనీల ప్రధాన రహదారిపై నల్లాలబావి వరకు దశాబ్దాల క్రితం సీసీరోడ్డు నిర్మించగా ప్రస్తుతం అది పూర్తిగా దెబ్బతిన్నది. పలు చోట్ల ధ్వసం జరిగి గోతులమయం అయింది. ప్రధాన రహదారికి వెళ్ళే దారి కావడంతో నూతనంగా సీసీ ఏర్పాటుకు కౌన్సిలర్ లక్ష్మణ్ చొరవ చూపి తిరిగి సీసీ నిర్మాణానికి కృషి చేశాడు. అందులో భాగంగానే రూ. 60లక్షలతో కొత్తగా సీసీరోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. కాగా అభివృద్ది పనులు నాణ్యవంతంగా చేపట్టి ధీర్ఘకాలికంగా మన్నిక ఉండేలా చర్యలు తీసుకోవాలని ముఖ్య అతిథులు సూచించారు. 500మీటర్ల పొడవున నిర్మిస్తున్న సీసీరోడ్డుతో శివాలయం కాలనీ, ఆదర్శనగర్ కాలనీ ప్రధాన రోడ్డు సుందరంగా మారనుందన్నారు. బాలికల ఉన్నత పాఠశాల నుండి నల్లాలబావి వరకు ఉన్న ప్రధాన రహదారిని సీసీతో నిర్మించనున్నట్లు కౌన్సిలర్ చెక్కాల లక్ష్మణ్ తెలిపారు.

## హోంమంత్రికి మైనార్టీల సత్కారం

**ఆమనగల్లు, అక్టోబర్07, ప్రభాతవార్త:** రాష్ట్రహోంశాఖ మంత్రి మహ్మద్ అలీని ఆమనగల్లు మండల మైనార్టీ నాయకులు శనివారం ఘనంగా సన్మాంచారు. బీఆర్ఎస్ పార్టీ మైనార్టీ నాయకులు సయ్యద్ ఖలీల్ ఆధ్వర్యంలో కల్వకుర్తి ఎమ్మెల్యే గుర్కా జైపాల్‌యాదవ్ సమక్షంలో హోంమంత్రిని కలుసుకుని బోకే, శాలువాతో సత్కరించారు. కడ్తాల మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన పోలీస్‌స్టేషన్ ప్రారంభోత్సవానికి హోంమంత్రి మహ్మద్ అలీ కడ్తాల మండల కేంద్రానికి విచ్చేసారు. ఈమేరకు బీఆర్ఎస్ పార్టీ మైనార్టీ నాయకులు మంత్రిని సన్మానించారు.

### కానిస్టేబుళ్లుగా ఎంపిక కావడం అభినందనీయం: వైస్ ఎంపిపి

**కొందుర్గు, అక్టోంబర్ 7, (ప్రభాతవార్త) :** ఆహర్నిశలు ఎంతో కష్టపడి తల్లిదండ్రుల సహకారంతో ఇద్దరు అన్నదమ్ములు కానిస్టేబుళ్లగా ఎంపిక కావడం ఎంతో అభినందనీయమని వైస్ ఎంపీపీ రాజేష్‌పటేల్ అన్నారు. కొందుర్గు పంచాయతీ పరిధిలోని చెక్కలోని గూడెం గ్రామంలో నల్లమోని బందెమ్మ, జంగయ్య దంపతుల ఇద్దరు కుమారులు నలమోని వెంకటేష్, సురేష్‌లు తెలంగాణ పోలీస్ శాఖలో కానిస్టేబుల్ ఉద్యోగాల కోసం ఎంపికైన సందర్భంగా శనివారం వారి స్వగృహంలో ఆయన ఇద్దరిని సన్మానించి అభినందించారు. ఈ సన్మాన కార్యక్రమంలో గ్రామస్థులు గండేటి నర్సింలు, బీఆర్ఎస్ నాయకులు వేణుగోపాల్, శంకరయ్య, శ్రీను, రాంచంద్రయ్య, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## నీటూరి సునీతకు తెలుగులో డాక్టరేట్

**మొయినాబాద్, అక్టోబర్ 7 ప్రభాతవార్త:** మొయినాబాద్ మండలం తోల్కట్ట ప్రాంతంలో ఉన్న వికారాబాద్ తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్సియల్ మహిళా డిగ్రీ కళాశాలలో తెలుగు లెక్చరర్‌గా పని చేస్తున్న నీటూరి సునీత పిహెచ్‌డి పట్టా పొందారు. ఈ మేరకు ఉస్మానియా విశ్వవిద్యాలయం నోటిఫికేషన్ జారీ చేసింది. పూర్వ రంగారెడ్డి, ప్రస్తుతం వికారాబాద్ జిల్లాకు చెందిన డా.సునీత గత 2019 నుంచి తోల్కట్ట సమీపంలోని వికారాబాద్ తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్సియల్ మహిళా డిగ్రీ కళాశాలలో తెలుగు లెక్చరర్‌గా పని చేస్తున్నారు. తన బోధనా పటిమతో విద్యార్థులు, అధికారుల మన్ననలు పొందిన సునీత ఎంతోమంది విద్యార్థులకు ప్రతిష్టాత్మక విశ్వవిద్యాలయాల్లో పిజిలో ప్రవేశం పొందడానికి కోచింగ్‌ను సైతం అందించారు. ఆచార్య మాదిరెడ్డి అండమ్మ పర్యవేక్షణలో ఆశ్రిత కులాల కళా వాద్యాల సంస్కృతి సాహిత్యాంశాలు, విశిష్టత అనే అంశంపై ఉస్మానియా యూనివర్సిటీలో సిద్ధాంత గ్రంథం సమర్పించి పిహెచ్‌డి పట్టా పొందారు. సహచర అధ్యాపకులు, కుటుంబ సభ్యులు సునీతను ప్రశంసించి హర్షం వ్యక్తం చేశారు. తనను పిహెచ్‌డి దిశగా ప్రోత్సహించిన యూనివర్సిటీ వైస్ చాన్సలర్, రిజిస్ట్రార్, గైడ్ ఆచార్య అండమ్మ, తన భర్త శివమురళి, కుటుంబ సభ్యులు, కాలేజీ ప్రిన్సిపాల్ డా.కె.శ్రీనివాస్ శర్మకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

### ఇన్‌స్పైర్ మనక్ పోటీలకు చేవెళ్ల విద్యార్థిని ఎంపిక

**మొయినాబాద్, అక్టోబర్ 7 ప్రభాతవార్త:** ఈ నెల 9 నుంచి 11 వరకు ఢిల్లీలోని ప్రగతి మైదాన్‌లో నిర్వహించనున్న జాతీయ ఇన్‌స్పైర్ మనక్ పోటీలకు రంగారెడ్డి జిల్లాలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, కళాశాల చేవెళ్లలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని ఉమాదేవి హాజరవుతుంది. పాఠశాల గైడ్ టీచర్ ఎస్.శ్వేత, సత్వీందర్ కౌర్ సారధ్యంతో ఉమాదేవి తయారు చేసిన ఈటింగ్ ఎడిబుల్ మష్రూమ్ (ప్లాస్టిక్ తినదగిన పుట్టగొడుగులు) ఈ సంవత్సరం జనవరి మాసంలో నిర్మల్ పట్టణంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో అత్యంత ఆదరణ పొంది జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ మేరకు ఢిల్లీ వెళుతున్న ఉమాదేవిని ఆర్‌సిఒ శారద వెంకటేష్, ప్రిన్సిపాల్ రమాదేవి, ఉపాధ్యాయులు అభినందించారు.

## రోడ్ల అభివృద్ధికి పెద్దపీట : ఎమ్మెల్యే జైపాల్ యాదవ్



చలంపల్లి గ్రామంలో బిటి రోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే

**కడ్తాల్, అక్టోబరు 07 ప్రభాతవార్త :**

రోడ్ల అభివృద్ధికి పెద్దపీట వేస్తానని ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ అన్నారు. రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలం చల్లంపల్లి గ్రామంలో శనివారం ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ పర్యటించారు. కడ్తాల్ గేటు నుంచి పడకల్ గేటు వరకు డబుల్ రోడ్డు నిర్మాణానికి సుమారు రూ. 20 కోట్లతో స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో అన్ని గ్రామాల, తండాలకు బిటి రోడ్లు ఏర్పాటు చేస్తామని తెలిపారు. తెలంగాణ ముఖ్యమంత్రి కెసిఆర్ అన్ని రంగాలు, అన్ని గ్రామాలకు ప్రత్యేక నిధులు మంజూరు చేసి అభివృద్ధి చేపట్టడం జరుగుతుందన్నారు. చల్లంపల్లి గ్రామానికి డబుల్ రోడ్డు ఏర్పాటు చేస్తున్నామని, ఈ రోడ్డు ఏర్పాటుతో సాలార్‌పూర్, తలకొండపల్లి ప్రజలకు సౌకర్యం ఏర్పాటవుతుందని అన్నారు. కార్యక్రమంలో జడ్పీటిసి దశరథ్‌నాయక్, సింగిల్‌విండో చైర్మన్ గంప వెంకటేష్‌గుప్తా, రైతు సమన్వయ కన్వీనర్ జోగు వీరయ్య, సర్పంచ్‌లు గుర్కా కృష్ణయ్య యాదవ్, గూడూరు లక్ష్మినర్సింహారెడ్డి, విజయలక్ష్మి శంకర్, సులోచనా సాయిలు, ఎంపిటిసి సభ్యులు మంజుల చంద్రమౌళి, ప్రియా రమేష్, ఉపసర్పంచ్‌లు జైపాల్‌రెడ్డి, వార్డు సభ్యులు, నాయకులు, సుదర్శన్‌రెడ్డి, గంప శ్రీను, గౌని లాలయ్యగౌడ్, అర్జున్‌రావు అధికారులు పాల్గొన్నారు.

## మాల్‌లో బిఆర్ఎస్‌లో చేరిన యాదవ సంఘం పెద్దలు



ఎమె ్మల్యే కిషన్‌రెడ్డి సమక్షంలో బిఆర్ఎస్‌లో చేరికల దృశ్యం

**యాచారం, అక్టోబర్ 7 ప్రభాతవార్త**

యాచారం మండలంలోని మాల్ గ్రామం నుండి 20 మంది యాదవ సంఘ పెద్దలు శనివారం బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి పార్టీలో చేరిన యాదవ సంఘం పెద్దలకు గులాబి కండువాలను కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తుందన్నారు. అన్ని సామాజిక వర్గాల వారికి సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి వారి ఆర్థిక పురోభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తుందన్నారు. రానున్న ఎన్నికల్లో అన్ని వర్గాల ప్రజలు బిఆర్ఎస్ గెలుపుకు కృషి చేసి ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రభుత్వానికి హ్యాట్రిక్ విజయాన్ని అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు కర్నాటి రమేష్‌గౌడ్, జడ్పీటీసి చిన్నోళ్ల జంగమ్మ యాదయ్య, నాయకులు సుభాని, మహేష్‌గౌడ్, కల్లూరి శివ తదితరులు పాల్గొన్నారు.

### ఇండియన్ ఆర్మీకి ఎంపికైన శంషాబాద్ గురుకుల విద్యార్థి

**యాచారం, అక్టోబర్ 7 ప్రభాతవార్త :** యాచారం మండల కేంద్రంలో నిర్వహిస్తున్న తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల/కళాశాలలో 2020-22 విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియెట్ ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణుడైన విద్యార్థి ముసలగారి లింగం ఇటీవల ప్రకటించిన ఫలితాలలో ఇండియన్ ఆర్మీకి ఎ ంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ కూకుట్ల యాదయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రంగారెడ్డి జిల్లా చౌదరిగూడెం మండలం ముష్టిపల్లి గ్రామానికి చెందిన ఈ విద్యార్థి ఎంపిక కావడం పట్ల ఆయన అభినందనలు తెలిపారు. పేద కుటుంబానికి చెందిన లింగం ఇండియన్ ఆర్మీకి ఎంపిక కావడం పట్ల కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు లింగంను అభినందించడమే కాకుండా శాలువాతో ఘనంగా సన్మానించారు. త్వరలో బెంగుళూరులో జరగనున్న శిక్షణకు లింగం వెళ్లనున్నట్లు తెలిపారు.

## ప్రజా సంక్షేమమే బిఆర్ఎస్ లక్ష్యం : ఎమ్మెల్యే మహేష్‌రెడ్డి



కుల్కచర్ల కేజీబివిలో భవనం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

**కుల్కచర్ల అక్టోబర్ 07, ప్రభాతవార్త :**

ప్రజా సంక్షేమం అభివృద్దే లక్ష్యంగా పనిచేస్తున్నదని పరిగి శాసన సభ్యులు కొప్పుల మహేష్‌రెడ్డి అన్నారు. శనివారం వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండల పరిదిలోని అల్లాపూర్ గ్రామ పంచాయతి భవనం, మండల కేంద్రంలోని కెజిబివి విద్యాలయంలో నిర్మించి ప్రారంబానికి నోచుకోని కళాశాల భవనంతో పాటు పలు అభివృద్ది పనులను ఆయన చేపట్టారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ ...మును పెన్నడూ లేని విదంగా తెలంగాణలో పలు అభివృద్ది పనులను చేపట్టిన ఘనత సిఎం కేసిఆర్‌దేనని ఆయన తెలిపారు. అనంతరం అల్లాపూర్ గ్రామ పంచాయితీలో మహిళలకు బతుకమ్మ చీరలు యువకులకు క్రికెట్ కిట్‌ను ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి సత్యమ్మ హరిశ్చందర్, జడ్‌పిటిసి రాందాస్‌నాయక్, మార్కెట్ కమిటి చైర్మన్ బృంగి హరికృష్ణ, రైతుబందు అద్యక్షుడు కేబి రాజు, మండల పార్టి అద్యక్షుడు శేరి రాంరెడ్డి, చౌడాపూర్ మండల అద్యక్షుడు సత్తినేని సుధాకర్‌రెడ్డి, పంచాయతిరాజ్ ఎఇ మణికుమార్ డిపిఒ తరుణ్, ఎంపిడిఒ నాగవేణి, ఎంపిఒ కరీం, మరియు ఆయా గ్రామాల సర్పంచులు వార్డుమెంబర్లు, కార్యకర్తలు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## దేశ రక్షణకు యువత ఆర్మీలో చేరాలి

**మర్పల్లి అక్టోమర్ 7 ప్రభాతవార్త :** దేశరక్షణ కోసం యువకులు ఆర్మీలో చేరి దేశ రక్షణ చేస్తే ఎంతో గర్వకారణంగా ఉంటుందని ఆర్మీ రిటర్మెంట్ సాగర్ అన్నారు. మర్పల్లి గ్రామానికి చెందిన ఉప్పరి సాగర్ ఆర్మీలో 20 సంవత్సరాల పాటు దేశ రక్షణ చేసి రిటర్మెంట్ అయ్యారు ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో తాసిల్దార్ గణేష్‌సిఐ అంజనేయులు ఎస్ఐ శ్రీధర్‌రెడ్డి ఎంపిడిఒ రాజమల్లయ్య సుపరిండెంట్ క్రిష్ణారావు జడ్పిటీసి మదుకర్ కాంగ్రెస్ మండల పార్టీ అద్యక్షులు రవి మాజి మండల అద్యక్షులు నర్సిములు ఎపిఒ అంజిరెడ్డి పలువురు అధికారులు నాయకులు పాల్గొన్నారు దేశ రక్షణ కోసం కుటుంబాన్ని వదలి ప్రాణాలను అరిచేతుల్లో పెట్టుకొని 24గంటలు సరిహద్దుల్లో కాపలా కాస్తూన్నా జవాన్లు దేశానికి ఆదర్శమన్నారు వారు కాపలా కాస్తుంటేనే దేశంలో మనము ప్రశాంతంగా జీవిస్తున్నామని పరువురు అన్నారు ఆర్మీలో పోవలంటే భయపడే రోజుల్లో ఉద్యోగం రాగానే తమ కొడుకును ఆర్మీలో పంపిన తల్లిదండ్రులు ధన్యులన్నారు యువకులు ఆర్మీలో చేరెందుకు కృషి చేయాలని అన్నారు అర్మీ సేవలను పలువురు కొనియాడారు భర్త ఎప్పుదు తిరిగి వస్తాడో కూడా తెలియకుండా క్షణ క్షణ భయంతో గడుపుతు నిద్ర లేని రాత్రులు గడిపానని సిద్దు సాగర్ భార్య జోతి లక్ష్మి అన్నారు పలువు రు అధికారులు నాయకులు శాలువలతో భార్యాహర్తలను సన్మానించారు

## సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి : సీఐ రాములు

**కొడంగల్, అక్టోబర్ 7ప్రభాతవార్త :** నేటి సమాజంలో తరుచూ జరుగుతున్న సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్దానిక సీఐ రాములు అన్నారు. శుక్రవారం రాత్రి మండల పరిధిలోని చిన్న నందిగామ గ్రామంలో గ్రామ సర్పంచ్ సావిత్రమ్మ సాయిలు అద్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సైబర్ నేరాల అప్రమత్తతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సంరద్భంగా జిల్లా పోలీసు కళాబృంధం సభ్యులు తమ అటాపాటలతో కళాజాత ప్రదర్శనతో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీఐ మాట్లాడుతు సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అలాగే బాల్య వివాహాల వల్ల జరిగే అనర్దాలను వివరించారు. అలాగే వివిధ అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా కళా బృంధం పోలీసులు, స్దానిక పోలీసులు, గ్రామస్దులు పాల్గొన్నారు.

## చేవెళ్ల గడ్డమీద బిజెపి జెండా ఎగరవేస్తాం

**షాబాద్, అక్టోబర్ 7, ప్రభాతవార్త :**

చేవెళ్ల గడ్డమీద బీజేపీ జెండాను ఎగరవేస్తామని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ప్రభాకర్‌రెడ్డి అన్నారు. శనివారం షాబాద్‌లో పార్టీ కార్యాలయంలో మండల బూత్ కమిటీ, శక్తి కేంద్ర ఇంచార్జ్‌ల వెరిఫికేషన్ డ్రైవ్‌ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ....ప్రతి కార్యకర్త పార్టీ కోసం ఒక సైనికుడిలా పనిచేయాలన్నారు. అధికారమే ధ్యేయంగా కలిసి పనిచేద్దామన్నారు. ఈనెల 10న అమిత్‌షా బహిరంగ సభను విజయవంతం చేయాలన్నారు. ఈకార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు కిరణ్, జిల్లా అధికార ప్రతినిధి శ్రీధర్‌రెడ్డి, స్వచ్ఛ భారత్ సెల్ రాష్ట్ర కన్వీనర్ రాము, ఓబీసీ జిల్లా కార్యదర్శి మాణెయ్య, యువమోర్చా జిల్లా కార్యదర్శి మహేందర్, నాయకులు శ్రీశైలం, మహేష్, సురేష్‌గౌడ్, మల్లికార్జున్, శ్రీశైలం, శ్రీధర్, హరికృష్ణ, సందీప్, వినయ్, మురళీధర్, హరికృష్ణ తదితరులు ఉన్నారు.

## శరన్నవరాత్రి ప్రచార కరపత్రం ఆవిష్కరణ

**ఆమనగల్లు, అక్టోబర్07, ప్రభాతవార్త:** ఆమనగల్లు పట్టణంలోని శ్రీవాసవి కన్యకపరమేశ్వరి ఆలయంలో అక్టోబర్15 నుండి దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అధ్యక్షుడు వీరబొమ్మ రాంమోహన్‌గుప్త, ప్రధాన కార్యదర్శి బికుమాండ్ల నర్సింహ్మాగుప్త తెలిపారు. 15నుండి 25వ తేదీ వరకు ఉత్సవాలు కొనసాగుతాయని, ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు వారు వివరించారు. ఈమేరకు శనివారం ఆమనగల్లు పట్టణంలోని శ్రీకన్యకపరమేశ్వరి ఆలయంలో 2023 శరన్నవరాత్రి ఉత్సవాల కరపత్రం ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు పాపిశెట్టి రాము, మెండెం చంద్రశేఖర్‌గుప్త, బికుమాండ్ల నటరాజ్‌యాదయ్యగుప్త, మంచుకొండ విష్ణువర్దన్, బికుమాండ్ల శ్రీనివాస్‌గుప్త, అర్థం లక్ష్మయ్యగుప్తలు హాజరు కాగా అధ్యక్షుడు వీరబొమ్మ రాంమోహన్‌గుప్త కరపత్రం ఆవిష్కరించారు.

### విద్యతో పాటు క్రీడలు ఎంతో అవసరం : ఎంపిపి రవీందర్‌యాదవ్

**షాద్‌నగర్, అక్టోంబర్ 7, (ప్రభాతవార్త) :** ప్రతి వ్యక్తి జీవితంలో క్రీడాలు కూడ ఒక భాగమేనని, విధ్యతో పాటు క్రీడలు ఎంతో అవసరమని, నేటి యువత రెండింటిలో రాణిస్తే ఉన్నతమైన స్థాయికి చేరుకుంటారని కేశంపేట ఎంపీపీ రవీందర్‌యాద్ అన్నారు. శనివారం షాద్‌నగర్ పట్టణంలోని మినీ స్టేడియంలో ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఎంపీపీ రవీందర్‌యాదవ్, స్థానిక మున్సిపల్ చైర్మన్ నరేందర్, జడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేష్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మొదటి మ్యాచ్‌కు ఎంపీపీ ట్రస్ వేసి అనంతరం బ్యాటింగ్ చేశారు. అదేవిధంగా క్రీడాకారులకు అల్ ది బెస్ట్ చెప్పి ఉన్నతంగా రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ ఛైర్మన్ లక్ష్మీ నర్సింహ్మారెడ్డి, కొందుర్గు జడ్పీటీసీ దామోదర్‌రెడ్డి, కౌన్సిలర్లు చెట్ల పావని నర్సింహ్మా, జీటీ శ్రీనివాస్, పార్టీ నాయకులు యుగేందర్, వెంకట్‌రెడ్డి, శంకర్, టీయూడబ్ల్యూజే 143 యూనియన్ షాద్‌నగర్ అధ్యక్షుడు కృష్ణ ముదిరాజ్, టోర్నమెంట్ నిర్వహకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

## గౌరారం అంజిరెడ్డి సేవలు వెలకట్టలేనివి

### -జడ్పీటీసి జంగమ్మ యాదయ్య

**యాచారం, అక్టోబర్ 7 ప్రభాతవార్త**

గౌరారం అంజిరెడ్డి సేవలు వెలకట్టలేనివని జడ్పీటీసి చిన్నోళ్ల జంగమ్మ యాదయ్య, మాజీ జడ్పీటీసి రాచంద్రయ్య, బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు కర్నాటి రమేష్‌గౌడ్‌లు పేర్కొన్నారు. యాచారం మండల పరిధిలోని నానక్‌నగర్ గ్రామంలో రాత్రి పాఠశాలను ఏర్పాటు చేసి గ్రామానికి చెందిన పలువురు నిరక్షరాస్యులు, యువతీ యువకులకు విద్యాబుద్దులు నేర్పించి చైతన్యవంతులుగా మార్చిన ఘనత ఆయనకు దక్కుతుందన్నారు. అంజిరెడ్డి హఠాన్మరణం అత్యంత భాదాకరమ న్నారు. ఈ సందర్భంగా ఆయన భౌతికకాయానికి వారు శనివారం పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాడ సానుభూతి సంతాపం తెలిపారు. ఈ కార్యక్ర మంలో బిఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు పులి నర్సింహ, ప్రధాన కార్యదర్శి బైకని శ్రీశైలం యాదవ్, నాయకులు, పార్టీ కార్యకర్తలు నివాళులు అర్పించారు.